
మరలనిదేల భారతంబన్నచో...

18 పర్వాల ఉపన్యాస వ్యాసాలు



తెలంగాణ సాహిత్య అకాడమి

మూసీ సాహిత్య ధార, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం,
తెలంగాణ సాహిత్య అకాడెమీ, శ్రీవేంకటేశ్వర కళాశాల,ఢీ.వి, న్యూఢిల్లీ
& ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన

మరలనిదేల భారతంబన్నచో...

(18 పర్వాల ప్రసంగ వ్యాసాలు)

కార్యనిర్వాహక సంపాదకులు

డా. నామోజు బాలాచారి

కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడెమి.

ప్రధాన సంపాదకులు

ఆచార్య సాగి కమలాకర శర్మ

పూర్వాధ్యక్షులు, తెలుగు శాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం

సంపాదకులు

డా. ఎస్.రఘు

అధ్యక్షులు, పాఠ్యప్రణాళిక సంఘం,
తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

డా. అట్టెం దత్తయ్య

సహాయాచార్యులు, ఎస్.వి.కళాశాల,
ఢిల్లీ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ

ప్రచురణ

తెలంగాణ సాహిత్య అకాడెమి

తెలంగాణ ప్రభుత్వం

Maralanidela Bharathambannacho...

(18 Parvala Prasanga Vyasalu)

సంపాదకులు

ఆచార్య సాగి కమలాకర శర్మ

డా. ఎస్.రఘు

డా. అట్టెం దత్తయ్య

ప్రచురణ సంఖ్య : 181

సంపుటి : 1

ప్రథమ ముద్రణ : 2026

ప్రతులకు

తెలంగాణ సాహిత్య అకాడెమి

కవర్ డిజైన్

బ్రహ్మం భావన గ్రాఫిక్స్,హైదరాబాద్

వెల : 450

డిటిపి :

కావ్యశ్రీ గ్రాఫిక్స్, హైదరాబాద్.

ప్రచురణ:

తెలంగాణ సాహిత్య అకాడెమి

కళాభవన్, రవీంద్రభారతి

సైఫాబాద్, హైదరాబాద్ - 4

ఫోన్ : 040-29703142

Editors

Prof. Sagi Kamalakara Sharma

Dr. S. Raghu

Dr. Attem Dattaiah

Publication No : 181

Volume : 1

First Editon : 2026

For Copies

Telangana Sahitya Academi

Cover Design

Brahmam Bhavana Grafix,Hyd

Price : 450

DTP :

Kavyasree Graphics, Hyderabad.

Printed at

Telangana Sahitya Academi

Kalabhavan, Ravindrabharathi

Saifabad, Hyderabad - 4

Phone : 040-29703142

ISBN : 978-93-92284-60-1

విషయ సూచిక

★	మా మాట ...	– డా. నామోజు బాలాచారి	4
★	తరం తరం ... భారతం	– ఆచార్య సాగి కమలాకర శర్మ	6
★	నవతరం దృష్టిలో మహాభారతం	– ఆచార్య మాడభూషి సంపత్ కుమార్	11
★	ఉస్ 'మాన్య' మహాభారతం	– ఆచార్య సాగి కమలాకర శర్మ	14
★	యువ భారత స్వరపర్వం	– డా.ఎస్.రఘు	19
★	సాహిత్యధార - పరిశోధన ఝరి	– డా. అట్టెం దత్తయ్య	26
01.	ఆదిపర్వం	– డా. వీపూరి వేంకటేశ్వర్లు	31
02.	సభాపర్వం	– డా. ఏ. మారుతి	59
03.	అరణ్యపర్వం	– డా. మల్లిపూడి రవిచంద్ర	71
04.	విరాటపర్వం	– డా. గరికిపాటి గురజాడ	87
05.	ఉద్యోగపర్వం	– డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ	103
06.	భీష్మపర్వం	– డా. బాశెట్టి లత	141
07.	ద్రోణపర్వం	– డా. ఐ. రమాదేవి	170
08.	కర్ణపర్వం	– డా. ఎస్. చంద్రయ్య	198
09.	శల్యపర్వం	– శ్రీ బి. ఆంజనేయులు	221
10.	సౌప్తికపర్వం	– డా. కె. ఈశ్వరబాబు	234
11.	స్త్రీపర్వం	– డా. కె.డి.డి. మృణాళిని	252
12.	శాంతిపర్వం	– డా. కె. పద్మరాణి	279
13.	అనుశాసనికపర్వం	– డా. అట్టెం దత్తయ్య	314
14.	అశ్వమేధపర్వం	– డా. తిరునగరి శరత్ చంద్ర	346
15.	ఆశ్రమవాసపర్వం	– శ్రీ బోళ్ల ప్రవీణ్ కుమార్	364
16.	మౌసలపర్వం	– డా. మల్లెగోడ గంగాప్రసాద్	377
17.	మహాప్రస్థానికపర్వం	– డా. మంత్రి శ్రీనివాస్	395
18.	స్వర్గారోహణపర్వం	– డా. టి. సతీశ్	423
★	వక్తల పరిచయం		444

ఆనుశాసనిక పర్వం

– డా. అట్టెం దత్తయ్య



భారతాన్ని సామాజిక కథాంశంగా మాత్రమే చెప్పాలనుకుంటే భారతయుద్ధం పూర్తి కాగానే ధర్మరాజుకు పట్టాభిషేకం చేసి ముగించేవారు. కాని తర్వాతి పర్వాలలో ఎన్నో సామాజిక అంశాలతో పాటు పారమార్థిక అంశాలు అందించారు. భోగలాలసమైన జీవితంతో పాటు, బంధవిముక్తియే జీవిత పరమార్థం అని లోకానికి భారతం ఉపదేశిస్తుందని అనిపిస్తుంది. అది శాంతి, ఆనుశాసనిక పర్వాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

పర్వనామం : 'ఆనుశాసనికము' అంటే 'అనుశాసించుటకు తగినది' అని అర్థం. 'అనుశాసించు' అనగా 'ఆజ్ఞాపించు, ఉపదేశించు' అనే అర్థాలు కూడా కనిపిస్తున్నాయి. ఈ పర్వం అంతా కూడా ఉపదేశాన్ని ఆజ్ఞాపించినట్లుగా కనిపిస్తుంది. అందుకే ఈ పర్వాన్ని ఆనుశాసనిక పర్వం అన్నారు.

పర్వ ప్రత్యేకత : ఆనుశాసనిక పర్వం శాంతి పర్వానికి విస్తరణం. కాని శాంతి పర్వానికి దీనికి కొంత వరకు తేడా కనిపిస్తుంది. శాంతి పర్వంలో చెప్పిన రాజధర్మాలు, ఆపద్ధర్మాలు ఈ పర్వంలో చెప్పలేరు. ఇందులో దానధర్మాలు, మానసిక ధర్మాలు, ఆచార ధర్మాలను ఎక్కువ పేర్కొన్నారు.

అందుకే ఈ పర్వాన్ని దానధర్మ పర్వమని, మోక్షధర్మ పర్వమని కూడా కొందరు నుడివారు. ఇది మహాభారత పర్వాల వరుసలో 13వది. ఇందులో మొత్తం 5 ఆశ్వాసాలు, 2148 పద్యగద్యాలు ఉన్నాయి. బ్రహ్మశ్రీ యెల్లంరాజు శ్రీనివాసరావు అన్నట్లు **"మహాభారత కథా వస్తువంతా ఒక ఎత్తు. శాంత్యానుశాసనికాలలో జరిగిన ఈ ధర్మబోధ ఒక ఎత్తు..."** (మహాభారత వైభవము.పు.385)

ఆనుశాసనిక పర్వం భారత కథాంశం లేనిది. ఇది మొత్తం ప్రశ్నోత్తరాలతో నిండింది. నా పరిశీలన ప్రకారం ఇందులో 101 ప్రశ్నలు ఉన్నాయి. కొన్నిసార్లు రెండు ప్రశ్నలు కలిపి ఏక సమాధానం కింద కనిపిస్తాయి. అందువల్ల ప్రశ్నల సంఖ్య 5,6 అటు ఇటు మారే అవకాశం ఉంది. ఈ వంద ప్రశ్నలకు జవాబులను భీష్ముడితో చెప్పించారు. ఒక్క ప్రశ్నకు మాత్రం సమాధానం స్వయంగా కృష్ణుడు చెప్పాడు. భీష్ముడు కొన్నిటిని నేరుగా చెప్పలేడు. వాటికి సరిపోయే పూర్వ ప్రముఖుల సంవాదాలను, ఇతిహాసాలను, ఉపాఖ్యానాలను, కథలను సమాధానంగా తెలియజేసాడు. 60 ప్రశ్నలకు మాత్రం భీష్ముడు నేరుగా సమాధానాలు చెపారు.

ఈ పర్వంలో కర్మ, దైవశక్తి, మానవ ప్రయత్న విశ్లేషణ, బ్రాహ్మణ క్షత్రియాది వర్ణ ధర్మాలు. బ్రహ్మచర్య గృహస్థాది ఆశ్రమ ధర్మాలు, సర్వమానవ సాధారణ ధర్మాలు, స్త్రీ పురుష స్వభావాలు, పాప పుణ్య కార్యాలు, తీర్థ మాహాత్మ్యాలు, గాంధర్వాది వివాహ భేదాలూ, దాన వస్తువులు, గోదానాదుల విశిష్టత- దాన గ్రహణ యోగ్యత, ధూప దీప నైవేద్యాల ఫలితం, తపోపవాసాదుల ప్రయోజనం, సాంఖ్య – యోగ తత్వాలూ, స్వర్గ గమన మార్గాలూ, ముక్తి సాధన విధానాలూ, సృష్టి తత్వం, శివ-విష్ణు స్వభావాలూ ఇలా యింకా అనేక ధర్మాలు వివరింపబడి వున్నాయి. ముఖ్యంగా ఈ పర్వం చివరి భాగంలో వున్న ఉమామహేశ్వర సంవాదం గొప్ప సమాచార భరితమైన చర్చా గోష్ఠి.

ధర్మరాజు ప్రశ్నల నేపథ్యం : ఏ కారణం లేకుండా పశ్నా లేదు. సమాధానం లేదు అన్నట్లుగా ఈ ధర్మరాజు ప్రశ్నలకు కారణం కూడా లేకుండా పోలేదు. అదేమిటంటే కురుక్షేత్ర యుద్ధం అనంతరం ధర్మరాజు చింతాక్రాంతుడైనాడు. పశ్చాత్తాపం పొందాడు. జరిగిన సర్వ నాశనానికి అతడే కారణమనుకున్నాడు. అందుకే తనకు రాజ్యపాలన అర్హత లేదని, తాను మహా పాతకుడినని బాధపడ్డాడు. ఆ పాప నివారణ జరగాలంటే తాను అరణ్యవాసానికి వెళ్ళి, భిక్షాటనచేస్తూ తపమాచరించాలని నిర్ణయించుకున్నాడు. ఆ సమయంలో తమ్ములు, ద్రౌపది, శ్రీకృష్ణుడు ధర్మరాజును పట్టాభిషేకానికి రకరకాల

మాటలతో ప్రేరేపించాల్సి వచ్చింది. వేదవ్యాసుడు కూడా బోధించాడు. చివరకు షోడశమహారాజు వృత్తాంతం చెప్పిన తర్వాత రాజ్య పట్టాభిషేకానికి అంగీకరించాడు. తర్వాత కూడా ధర్మరాజు మనస్సు సరిగ్గాలేదు. ఆ రాజు మనశ్శల్యాన్ని సరి చేయడానికి భీష్ముడే సరైనవాడని వ్యాసుడు, కృష్ణుడు కలిసి నిర్ణయించారు. భీష్ముడు ఆ సమయంలో అంపశయ్య మీద పడుకుని ఉత్తరాయణం కోసం ఎదురుచూస్తున్నాడు. స్వయంగా కృష్ణుడు పాండవులను వెంట పెట్టుకుని అతని దగ్గరకు వెళ్ళాడు.

భీష్ముడిని కుశల ప్రశ్నలు అడిగిన తర్వాత శ్రీకృష్ణుడు *"ఈ ధర్మరాజు మిత్రులు, బంధువులు అందరు మరణించగా దుఃఖంతో బాధా తప్తుడై ఉన్నాడు. నీ ఉత్తమమైన మాటల పోహళింపు చేత ధర్మరాజు బాధను తొలగించవసిందని కోరుతున్నాను."* (శాంతి. 2. 109) అని అన్నాడు. కృష్ణుడి రాకకు భీష్ముడు సంతోషించాడు. ఆయనకు కుచ్చుకుని ఉన్న బాణాలతో శరీరంతో పాటు, మనస్సు కూడా వశవర్తి కానివ్వడం లేదు. కృష్ణుడితో సంభాషించే సామర్థ్యం కూడా లేదు. కంఠధ్వని, నాలుక స్పష్టతను కోల్పోయాయి. ప్రత్యుత్తరం ఇవ్వలేకపోతున్నాడు. క్షమించమన్నాడు. ఆ బాధలు తొలగిపోవడానికి కృష్ణుడు భీష్ముడికి మూడు వరాలు ఇచ్చాడు. బాణాల వల్ల ఎలాంటి నొప్పి కలుగకుండా సుఖంగ ఉండుట మొదటిది. ఆకలి దప్పుల పీడ లేకుండా ఉండుట రెండవది. అతని మనసు దేనికి అంటకుండా అతిశయ జ్ఞానాన్ని పొందుట మూడవది. అప్పుడు భీష్ముడు ఏ బాధ లేకుండా ఉన్నతమైన విజ్ఞానాన్ని పొందినట్లు కూడా గ్రహించాడు. అయినప్పటికీ కృష్ణుడినీ **"పాండవులకు ఇవన్నీ నీవెందుకు చెప్పవు"** అని అడుగుతాడు. **"అత్యుత్తమ కీర్తిని నీకు కూడా ప్రసాదించాలని తదనుగుణంగా నా జ్ఞానాన్ని నీ మనస్సులో ప్రవేశపెట్టాను"** (శాంతి. 2. 147) **"నీవు నెప్పెడి సు వాక్యములును వేద తుల్యంబులై వెలయుచుండు..."** (శాంతి. 2. 148) అని భీష్ముడు చెప్పే మంచి మాటలన్నీ వేదాలతో సమానమైనవని శ్రీకృష్ణుడు పలికాడు. ఈ మాటల ఆధారంగా భీష్ముడు చెప్పబోయే సమాధానాలు అన్నీ కృష్ణుడు చెప్తున్నట్లుగానే భావించాలి. రెండు పర్వాలలో కలిసి ధర్మరాజు ఇంచుమించు 200లకు పైగా ప్రశ్నలు అడిగాడు. ధర్మరాజుకి భీష్ముడు స్వధర్మాచరణ గురించే బోధించాడు. భగవద్గీతలో కూడా అర్జునుడికి శ్రీకృష్ణుడు అదే బోధించాడు. ఈ భీష్మ బోధ కూడా ఒక భగవద్గీత వంటింది. భగవద్గీత ప్రభు సమ్మితము. అందులో ఉపాఖ్యానాలు లేవు. కాని భీష్మ బోధ సుహృత్సమ్మితము. ఇది అనేక ఉపాఖ్యానాల సమ్మేళనం కూడా. కొన్ని సమాధానాలను భీష్ముడు కాంతా సమ్మితంగా కూడా తెలియజేసినట్లు కనిపిస్తాయి.

భీష్ముడు – ధర్మరాజు : ప్రశ్న ఒక మెట్టు అయితే సమాధానం మరొక మెట్టు. అంటే ప్రశ్నించే వారి స్థాయి కూడా ఒక ప్రత్యేకమైనదే. ఉత్తరం అందించే వారి స్థాయికి తగ్గట్టుగా ఉండాలి. లేకుంటే ప్రశ్నోత్తరాలలో పస ఉండదు. ఇక్కడ భీష్ముడు, ధర్మరాజు ఇద్దరు మహానుభావులే. భీష్ముని గురించి ఈ సందర్భంలో కృష్ణుడు

"రాజవె! రాగహీనుండవె! రాజిత సుందరమూర్తి యట్టి! వి
భ్రాజిత సంపదున్నతి విభాసిత వర్తనుడట్టి! కామినీ
రాజి మనోజ్ఞభంగి చతురత్వ ధనుండవె! బ్రహ్మచర్య దీ
క్షా జిత మన్మథుండు నవె! జన్మము లిట్టివి యెందు గల్గునే?" (శాంతి.2.103)

అనే పద్యంలో క్షత్రియుడిగా జన్మించాడు. విరాగియై మహర్షిగా జీవించాడు. ఎంతటి ప్రకాశ సుందరమూర్తియో అంతకంటే అత్యున్నత ప్రకాశంగా వెలుగొందే నడవడిక కలవాడు. స్త్రీ సమూహానికి మనోహరమైన నైపుణ్య సంపద కలవాడు. కాని బ్రహ్మచర్య దీక్ష చేత మన్మథుడిని జయించినవాడు. ఇట్లాంటి జన్మలు మరెక్కడైనా సంభవిస్తాయా? (శాంతి.2.110) అనే కృష్ణుడి మాటలు భీష్ముని యొక్క అనుభవత్వాన్ని, విజ్ఞానాన్ని, సామర్థ్యాన్ని తెలియజేస్తాయి. ఇంతటి మహోన్నత వ్యక్తిని ప్రశ్నలు అడగాలి అంటే అన్ని రకాల విషయ విజ్ఞానం అవసరం. అట్లాంటివారు భారతంలో ధర్మరాజు ఒకరే కనిపిస్తారు. ఆ ధర్మరాజును గురించి ఈ సందర్భంలో స్వయంగా భీష్ముడే **"ఎవ్వడు పుట్టిన నెల్ల మునీంద్రులు..."** (శాంతి.2.151) అనే పద్యంలో ఎవ్వడి జన్మకారణంగా సమస్త మునీంద్రులు సంతోషాంత రంగులయ్యారో, పరమ ధార్మికులని పేరు పొందిన భరత వంశీయులు కూడా ఎవ్వడితో సాటిరారో, సత్యం, శౌచం, శాంతి దాంతులు ఎవ్వడియందు ప్రకాశిస్తూ ఉంటాయో, పాత్రులైన వారికే దానం చేయటం, యజ్ఞాలనూ, బంధుపులను, రక్షించటం మొదలైన ఉత్తమ ధర్మాలన్నీ ఎవడికి సంతోషాన్ని కలిగిస్తుంటాయో, కామం వలన గాని, భయం వలన కాని, అవినీతి మార్గంలో ఎవడయితే ప్రవేశించడో అటువంటి ఉత్తమ గుణగణుడైన వాడు ధర్మరాజు అంటాడు. భారతంలో ధర్మరాజు బహుముఖీనంగా దర్శనమిస్తాడు. ఎంతటి వీరుడో అంతటి శాంతిమంతుడు. ధర్మాధర్మాలు తెలిసివాడు. కుటుంబ నిర్వహణలో, రాజ్య పాలనలో తనకు తానే సాటి. ఆయన స్వయంగా రాజు అయినప్పటికి ధర్మగామి, మోక్షగామి. బాల్యంనుడి అనేక సమస్యలను ఎదుర్కొన్నవాడు కావడంతో అన్ని రకాల ప్రశ్నలను అడిగాడు.

ప్రశ్నలు – సమాధానాలు : మనిషి పరిణామ రహస్యం ప్రశ్నించడం అనే సులభమైన ప్రక్రియతో ప్రారంభమౌతుంది. ఏదైనా తెలుసుకోవాలంటే ఎరుకతో ప్రశ్నించడమే ఏకైకమార్గం. ప్రశ్నించడం అనేది తనను తాను అభివృద్ధి పరచుకోవడానికి ఓ మంచి పరికరం. ప్రశ్నలే ఉన్నత లక్ష్యాలవైపు నడవడానికి సహాయం చేస్తాయి. ప్రశ్నించడం ఒక కళ. ప్రశ్నించడం ఒక బాధ్యత. ప్రశ్నించడం ఒక తెలివిడి కోసం చేసే యత్నం. ప్రశ్నలు పలురకాలు. మానసిక సంబంధమైనవి. శారీరక సంబంధమైనవి. ఆధ్యాత్మిక సంబంధమైనవి. సమాజ సంబంధమైనవి. ప్రశ్నలు అడగడంలో కూడా తేడాలుంటాయి. తెలుసుకోవాలనే జిజ్ఞాసతో అడగడం. ఎదుటివాడికి తెలుసా లేదా అని పరీక్షకోసం అడగడం. నాకు ఆ రంగంలో విజ్ఞానం ఉందని చూపించుకోవడం కోసం అడగడం. అడిగిన ప్రశ్న ఆధారంగా వారి స్థాయిని కూడా నిర్ణయించవచ్చు. మనస్తత్వాన్ని గమనించవచ్చు. వారి అస్తిత్వాన్ని కూడా పట్టిస్తాయి.

అసలైన ప్రశ్నలు సమాధానాలు అంతంకాని గొలుసువంటివి. సమాధానం కూడా మరొక ప్రశ్నకు దారితీసినప్పుడే మనిషి ఎదుగుదల నిరంతరం పరివ్యాప్తమవుతూ ఉంటుంది. చాలామంది ఈ ప్రయాణంలో ఆగిపోయే అవకాశం ఉంటుంది. లభించిన సమాధానంతోనే సంతృప్తి చెందేవారు ముందుకు వెళ్ళలేరు. ప్రశ్నను సమీకరించి సరైన మార్గంలో సంధిస్తే సమాధానం కనుగొనడం అసాధ్యం కాదు. ప్రశ్నను అడగడం అంటే మనల్ని మనమే సమాధానాలను అందుకునే ప్రథంలో నియమించుకోవడం అని అర్థం. ప్రశ్నను కలిగి ఉన్నప్పుడే సమాధానాలను ఆకర్షించగల శక్తిని కలిగి ఉంటారు. ప్రశ్నించిన వ్యక్తికి సమాధానం తెలుసుకోవడంలో ఉత్సాహం లేనప్పుడు అక్కడ సమాధానం ఉండదు. ప్రశ్నించడం అనేది విత్తు నాటడం వంటిది. ఏ విత్తును నాటుతున్నారో ఆ వృక్ష ఫలాలను పొందుతారు.

ఈ ఆనుశాసనిక పర్వంలో మాత్రం కొన్ని ప్రశ్నలకు పద్ధతి లేదు. కొన్ని ప్రశ్నలకు స్పష్టత లేదు. కొన్ని ప్రశ్నలు నవ్వును తెప్పిస్తాయి. కొన్ని పశ్నలు ఆలోచనలో ముంచెత్తుతాయి. దీనికి కారణం మనందరం విశ్వసించే ప్రక్షిప్తాలు అనుకుంటే, మరో కారణం ధర్మరాజు మనో చాంచల్యం, పశ్చాత్తాప హృదయం.

psychological theory of disturbance ప్రకారం మనోభావాలు, గత అనుభవాలు, మరుగున పడిన ఆలోచనలు ధర్మరాజు మానసిక స్థితిని ప్రభావితం చేసాయి.

Social disturbance theory ప్రకారం కొన్ని వర్గాలను అణగ దొక్కడం, అసమానతలు వంటివి అశాంతికి గురి చేస్తాయి. ఈ రెండు ధర్మరాజు విషయంలో వర్తించే అవకాశం ఉంది.

ఇట్లాంటి సిద్ధాంతాల కోణంలో చూసినపుడు ధర్మరాజు పాలివారి అణచివేతకు గుర్తై, ఆవేశపూరితంగా యుద్ధంలో అందరిని పోగొట్టుకుని అశాంతిగా ఉన్న సమయం ఇది.

ఎంతటి అశాంతి అంటే శాంతిపర్వం పూర్తయిన తర్వాత ధర్మరాజుకు "కొంచం కూడా శాంతి కలగలేదు. శాంతి ఎలా కలుగుతుందో చెప్పగలవు' అంటాడు. ఈ మాటతోనే ఆనుశాసనిక పర్వం ప్రారంభం అవుతుంది.

"నించుక యేనియు శమము లేకున్నది;.... శాంతి యెట్లు సిద్ధించు మునిమానవీయ యింక నేమి జేయువాఁడ?..." (అను.1.3) అన్నాడు. అప్పుడు భీష్ముడు కర్మ గురించి చెప్పాడు. అది ఒక సంవాదంతో...

1. కర్మ

'గౌతమీ లుబ్ధక సర్ప మృత్యుకాల సంవాదం' లో గౌతమి అనే పేరు గల గౌతమీ అనే స్త్రీ ఉంటుంది. ఆమె కుమారుడు పాము కాటుతో మరణిస్తాడు. దుఃఖిస్తున్న ఆ కుమారుడి తల్లి దగ్గరకు ఒక అడవి జాతివాడు పామును పట్టి తీసుకొని వస్తాడు. మీ కుమారుడు ఈ పాము కాటువల్ల చనిపోయాడు. దీన్ని చంపుతాను అంటాడు. ఆ తల్లి పామును చంపడానికి అంగీకరించదు. పైగా ఆ పామును వదిలి పెట్టుమంటుంది. అతడు అంగీకరించడు. అప్పుడు పాము "ఇది నా తప్పుకాదు. నేను మృత్యుదేవత ఆజ్ఞ ప్రకారం చేసిన. అంతేగాని నాకు కోపంగాని, కోరిక గాని ఆ బాలుని పట్ల లేవంటుంది. కుండల తయారి వాడి చేతిలో సారెను తింపే చేతికర్ర వంటిదానిని అని అంటుంది పాము. అయినప్పటికిని పామును వదలను అంటాడు కిరాతకుడు. మృత్యువు వచ్చి చెప్పిన వినడు. అప్పుడు యముడు వచ్చి ఈ పసివాడి మృత్యువుకు కారణం వాడి కర్మమే అంటాడు. ఈ జనన మరణాలు, సుఖ దుఃఖాలు అన్నీ కర్మవశాననే వస్తాయని తెలుపుతాడు.

"వినుఁ కర్మం బొనరించును / జననము, మరణంబు, నదియ సౌఖ్యము, దుఃఖం
బును గావించుం, దనచే / సిన దానిం బడకపోవ శివునకు వశమే?" (ఆనుశా.1.34)

కర్మవల్ల వచ్చే జనన, మరణ, సుఖ, దుఃఖాలను తప్పించుకోవడం ఆ శివుడికైన సాధ్యం కాదనే విషయం ఈ పద్యం తెలుపుతుంది. కర్మానుగుణంగానే మనుషులంతా దేహాన్ని పొంది ప్రవర్తిస్తారు. దీనికోసం కోపం, ఏడ్పూ దేనికి? మానవ జీవన సుఖ దుఃఖాలకు, జనన మరణాలకు కర్మనే కారణం అనే విషయాలను ఈ సంవాదం సోదాహరణంగా తెలుపుతుంది. ఇలాంటి పద్యమే భాగవతంలో ఒకటి కనిపిస్తుంది...

"కర్మమున బుట్టు జంతువు / కర్మమునను వృద్ధిపొందు కర్మమున జెడున్
కర్మమె జనులకు దేవత / కర్మమె సుఖదుఃఖములకు కారణ మధిపా." (భాగ. 10. 884)

భారతం ఇంచుమించు ఈ కర్మలను గురించి సందర్భానుగుణంగా ఐదు అర్థాలలో వాడినట్లు కనిపిస్తుంది. సహజంగా కూడా సర్వ వ్యాపారాలు కర్మలే అని తెలుసు. ఈ విషయాన్ని భగవద్గీతలో –**"న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్।** (భగవద్గీత. 3..5)

ప్రకృతి గుణాలతో కూడిన ప్రతి ఒకరు కర్మ చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండలేరని పై శ్లోకం తెలుపుతుంది. బలవంతంగా కర్మలు మానినట్లయితే తన ఉనికిని ఆత్మ రూపస్థితిని తెలుసుకోలేక పోతారనే విషయాన్ని **"న కర్మణా మనార మ్భాన్నైష్కర్మ్యం ..."** (భగవద్గీత. 3. 4) అనే ఈ శ్లోక పాదం వ్యక్తపరుస్తుంది. ఈ వాక్యాల ఆధారంగా మనుషులు ప్రకృతిలో ఉండి, ప్రకృతితో మమేకమై, ప్రకృతిని ఆస్వాదిస్తూ కర్మచేస్తూనే ఉంటారు.

కర్మ చేయడానికి మార్గాలు మూడు రకాలు. అవి మనసు, వాక్కు, కాయము. కాబట్టి మానవుని శరీరంలో ఏ భాగం కొంత పని చేసిన అది కర్మగానే భావించాలి. అందువల్ల కర్మచేయని వారుండరు. సంచిత, ఆగామి, ప్రారబ్ధం అనే మరో మూడు రకాల కర్మలుంటాయి. వీటితో పాటు మరో రెండు రకాల కర్మలుగా చూడవచ్చు. అవి ఫలాపేక్ష కర్మలు, నిష్కామ కర్మలు అనేవి.

"భూమిలో కొందరు సిరిసంపదలతో తులదూగుతూ సుఖానుభవిస్తుండగా మరి కొంతమంది పేదరికంతో అగచాట్ల పాలై దుఃఖ పడుతుంటారు. ఇందుకు కారణమేమిటో వినగోరుతున్నాను (ఆను. 5. 85) అన్నాడు. ముందు జన్మల చేసిన కర్మలకు ఈ జన్మలో ఏమేమి పొందుతాడు అనే విషయాల్ని రఃసంవాదంలో 24 పద్యాలలో తెలియపరిచారు. అంటూ ఇలా 37 విషయాలు ఈ సమాధానంలో తెలియజేస్తాడు.

"కొందరు చేసిన తప్పులకు దండన వంటివి ఈ జన్మలోనే అనుభవిస్తున్నారు కదా! మీరు వచ్చేజన్మలో ఫలం అనుభవిస్తారు అంటున్నారు దానిని తెలియపరుచు"
(ఆను. 5. 112)

"కర్మఫలాలు అనుభవించక తీరదంటున్నారు. ప్రాయశ్చిత్తాలవల్ల దోషాలు తొలగిపోతాయని అంటారు. అశ్వమేధయాగం చేస్తే సర్వ పాపాలు పటాపంచలవుతాయనే మాటలు వింటున్నాను. వీటి విషయం తెలియజేయమం"టుంది. (ఆను. 5.116) కోరి కోరి చేసిన కర్మలకు ప్రాయచిత్తం లేదంటాడు.

"...కర్మాచరణం జీవుల వశమనీ, సూర్యాది గ్రహాలకు అధీనమనీ రెండు విధాలుగా చెప్పుతుంటారు. ఇందులో ఏది బలీయమో సెలవియ్యండి" (ఆను. 5.122) గ్రహాల ప్రభావం ఏమి లేదు. అంతా నరుడే కారణం అంటాడు.

"పిల్లలు చావటానికి, పెద్దలు చిరకాలం జీవించటానికి కారణం ఏమిటి?" (ఆను. 5.127) అని ప్రశ్నిస్తుంది. దానికి భీష్ముడు...కాలం శరీరాన్ని శుష్కింప జేస్తుంది గాని చంపలేదు. నరుడు చేసిన పూర్వకర్మలే అతడి జీవిత కాలాన్ని పెంచటం పల్ల, క్షీణింపజేయడం పల్ల బతకడం, చావడం అనేవి సంభవిస్తాయి అని తెలుపుతాడు. ఇలాంటి కర్మ సంబంధ అంశాలు ఈ పర్వంలో అక్కడక్కడ మరిన్ని చోటు చేసుకున్నాయి.

అనుశాసనిక పర్వంలో ప్రతిపాదించిన కర్మసిద్ధాంతాన్ని 'కారణ–కార్య సిద్ధాంతం' ప్రకారం ప్రతి కార్యానికీ తగిన ఫలితం తప్పనిసరిగా ఉంటుంది. గౌతమీ–లుబ్ధక–సర్ప–మృత్యు–కాల సంభాషణలో బాలుని మరణానికి పాము, మృత్యువు లేదా కాలం కారణం కాదని, అతని పూర్వకర్మలే మూలకారణమని యముడు వివరించడం దీనికి నిదర్శనం. అలాగే 'నైతిక బాధ్యత సిద్ధాంతం' ప్రకారం మనిషి చేసే ప్రతి శుభాశుభ కర్మకు తానే బాధ్యుడు. దాని ఫలితాన్ని తానే అనుభవించవలసి ఉంటుంది. గ్రహాలు, దైవం లేదా ఇతరులను నిందించడం కంటే వ్యక్తి కర్మలే జనన–మరణాలు, సుఖ–దుఃఖాలు, ఆయుష్షు వంటి జీవన ఫలితాలను నిర్ణయిస్తాయని పైవిషయాలు తెలియజేస్తున్నాయి.

2. దానం

ఈ పర్వాన్ని దాన ధర్మపర్వం అన్నారు. ఎక్కువ శాతం దానం గురించే ఇందులో ఉంది. దానం అంటే తన ధనాన్ని గాని, ద్రవ్యాన్ని గాని ప్రతిఫలాపేక్ష లేకుండా దీనులకు, అవసరార్థులకు ఇవ్వడం. అమరకోశం 'దానం అంటే నరకం నుంచి తరింపచేసేది. పుణ్యము ప్రతిపాదింపబడేది, పాపాన్ని తొలిగించేది. మీది జన్మమునకు మొలవ పెట్టబడేది' (అమరకోశం. పు. 452) అని చెప్తుంది. దానాన్ని ఉపనిషత్తులు అమృతత్వం అంటాయి. (త్యాగేనైకే అమృతత్వ మానుశుః) భగవద్గీతలో మానవుడు వదలకూడని

మూడు పనులలో 'దానం' ఒకటిగా చెప్పబడింది. (యజ్ఞదాన తపః కర్మ న త్యాజ్య...) దానాలలో అష్ట, దశ, షోడశ దానాలున్నాయి. చతుర్విధ ఉపాయాలలో (సామ, దాన, భేద, దండ) దానం ఒకటి. దానాన్ని ప్రతి ఒక్కరు ఏదో ఒక రూపంలో ఇతరుల నుంచి పొందుతారు. ఇస్తారు, కాని దాని గొప్పతనం, విధానం, ఫలం, పద్ధతి, బాధ్యతలను గుర్తించడం తక్కువ. ఈ విషయాలనే భారతం సవివరంగా – దానం ఎవరికి, ఎందుకు, ఏవిధంగా, ఎంత, ఏమి, ఎప్పుడెప్పుడు చేయాలి? ఎవరికి చేయకూడదు? అనే విషయాలను ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు భీష్ముడు చెప్పిన సమాధానాలలో సంపూర్ణంగా తెలియజేసింది.

దానం ఇవ్వడానికి ఉత్తములైన యోగ్యులు ఎవరు? (అను. 2.58) **దానానికి ఎవరు పాత్రులు? (అను. 2.50)** అనే ప్రశ్నలకు భీష్ముడు ఇలా సమాధానం చెప్పాడు. **"భోజనార్థుల దుష్టి బొందించు నతడును..."** (అను. 2.59) ఆకలితో వచ్చిన వాళ్ళకు భోజనం పెట్టేవారు, దొంగల వల్ల అంతా పోగొట్టుకొన్నవారు, వ్రతం ఉద్యాపనం చెయ్యడం కోసం యాచించేవారు, గురువును, తల్లిని, తండ్రిని, భార్యను, పుత్రులను పోషించడం కోసం ధనం కావల్సినవారు, దీర్ఘవ్యాధిని పోగొట్టు కోవడం కోసం ప్రయత్నిస్తున్న వారు, ఎప్పుడూ భిక్షాటనతో జీవించే పాపం లేని విజ్ఞానులు – ఈ ఆరు విధాలవారు యోగ్యులు అంటాడు. ఉత్తమ ధర్మపరులూ, క్రోధం లేనివాళ్ళు, సత్యవంతులు, దాంతులూ, ధీరులు, స్వధర్మపరులూ, ఇంద్రియాలను జయించినవాళ్ళూ, సర్వప్రాణులకీ మేలుచేసేవాళ్ళూ, లోభం లేనివాళ్ళూ, శుచిమంతులూ దానపాత్రులు. వేదాలు సాంగంగా చదువుకుని, షట్కర్మలూ నిష్ఠతో పాటించే తత్వవేదులైన విజ్ఞానవంతులకి చేసిన దానం వెయ్యిరెట్లవుతుంది.

మంచి పాండిత్యం, చక్కని ప్రజ్ఞా, ఉత్తమమైన శీలం, నడవడి కలవాళ్ళకి దానం చేస్తే వంశం వృద్ధి పొందుతుంది. యోగ్యుడైన విజ్ఞానవంతుడు ఒక్కడు సంతృప్తి పడినా చాలు, ముక్కోటి దేవతలూ సంతృప్తి పడతారు. మునులూ, పితరులూ తృప్తి పడతారు. అందువల్ల మంచి విజ్ఞానిని వెతికి పిలుచుకువచ్చి దానమివ్వాలి అంటాడు భీష్ముడు.

ధర్మరాజు ప్రత్యేకించి కొన్నిరకాల వారికి దానం చేయడం మంచిదా? అని ఎంపిక చేసుకుని అడిగిన మరో రెండు ప్రశ్నలు కూడా కనిపిస్తాయి.

విజ్ఞానవంతుడు దానం పుచ్చుకోవడానికి ఎలా అర్హుడు అవుతాడు? సన్యాసిగా ఉంటేనా? లేదా, ఎలా ఉన్నా సరేనా? (అను. 2.31) **పూర్వ సంబంధం లేనివాడూ,**

బంధువు కానివాడూ, పండితుడూ, యజ్ఞం చేసినవాడూ, నిత్య తపస్వీ – వీరిలో దానానికి ఎవరు ఉత్తములు? (అను. 2.36) అనే ప్రశ్నలకు భీష్ముడు 'తన ధర్మం తప్పకుండా నడుచుకునే మంచి విజ్ఞానవంతుడు అన్ని విధాలా దానానికి అర్హుడౌతాడు. అతడు సన్యాసి కావచ్చు, కాకపోనూ వచ్చు' అని ఏక వాక్యంలో సమాధానం ఇచ్చాడు.

వీళ్ళందరూ దానానికి సత్పాత్రులే. కాని ధర్మ పన్నాగాలు ఏకరువు పెట్టడం తప్ప, ఆచరణలో పాటించని వాళ్ళకి బంగారం మొదలైనవి దానం చేసినవాడు పదేళ్ళు నరకం అనుభవిస్తాడు.

ఎలాంటి మనసుతో దానంచేయాలి? (అను. 5.211) **శ్రద్ధతో దానం చేస్తే ఏ పాపమూ జనానికి అంటదని భావిస్తాను. నిజమేనా?** (అను. 2.35) అని అడిగితే... 'సందేహం ఎందుకు? శ్రద్ధ గల మహాత్ములూ ఆదరంతో చేసిన దానం వల్ల పుణ్యం కాకుండా పాపం ఎలా వస్తుంది? అని చెప్తాడు.

"పరుషత్వము లేకంతః / కరణంబున శుద్ధి చాల గలిగి ప్రియము పొం
పిరిపోవఁ జేత దానము / పరమోత్కృష్టంబు..." (అను. 5.212)

'కాఠిన్యం లేకుండా మనసా, వాచా, కర్మణా సంతోష పూర్వకంగా చేసే దానం అత్యుత్తమం.' పై రెండు ప్రశ్నలలో దానం చేసేటప్పుడు శ్రద్ధ, ప్రేమ రెండు అవసరం అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. ఎంత చిన్న దానం అయినా ఎంత పెద్దదైన తీసుకునే వారెవరైనా శ్రద్ధతో, ప్రేమతో ఇచ్చినపుడు మాత్రమే తీసుకునే వారు ఆశీస్సులు, కృతజ్ఞతలు మనస్ఫూర్తిగా అందిస్తారు. పెద్దల మాట ప్రకారం దానం తీసుకునే వారు దైవంతో సమానంగా భావించినపుడు మాత్రమే సంతోషంతో ఇవ్వగలరు.

దీన్ని తైత్తిరీయోపనిషత్తు – '(శ్రద్ధయా దేయమ్' (శ్రద్ధతో), 'హ్రియాదేయమ్' (నేనేమి ఇవ్వగలను అను లజ్జతో), 'భియాదేయమ్' (నా కర్తవ్యం), 'సంవిదాదేయమ్' (జ్ఞానపూర్వకం)గా దానం చేయాలని చెపుతుంది.

భగవద్గీత వీటిని మూడు విధాలుగా చెపుతుంది. 1. సాత్త్విక దానం 2. రాజస దానం 3. తామస దానం(భగవద్గీత. 17. 20,21,22).

అడిగితే ఇవ్వడమూ, అడకుండా ఇవ్వడమూ ఈ రెండింటిలో ఏది గొప్పది? (అను. 2.342) అని అడిగితే **"అడిగిన నిచ్చుకంటెను నయాచకుఁ గాఁగ నెఱిఁగి యిచ్చుటె/క్కుడు ఫలమిచ్చు; దానవిధి కోవిధ! వేడుట సావు వేఁడఁగా/బడుటది పెద్దసావు;**

(ఆను. 2. 343) 'అడిగితే ఇవ్వటం కంటె అవసరం ఉండి అడగలేనివాడిని ఎరిగి ఇచ్చిన దానం గొప్ప ఫలాన్నిస్తుంది. అసలు అడగడం అనేది చావు వంటిది. ప్రార్థించడం పెద్దచావు వంటిది. అడగని వాడికి ఇవ్వడం వల్ల వాడిని రక్షించేవాడౌతాడు' అని పద్య భావం. ఇందులో 'అడగడం', 'ప్రార్థించడం' అనేవాటిని చావుతో పోల్చాడు. ప్రతి ఒకరికి ఆత్మగౌరవం ఉంటుంది. ఇతరుల దగ్గరకు వెళ్ళి చేతులు చాచుతున్నాడు అంటే ఆత్మగౌరవాన్ని చంపుకోవడమే. ఆత్మగౌరవాన్ని చంపుకోవడం అనేది చావడం వంటిదే.

దానం, యజ్ఞం ఈ రెండింటిలో అధికఫలం ఏది ప్రసాదిస్తుంది? (ఆను. 2. 345)

అనేక విధాల దానాలను చెప్తున్నారు. వాటన్నిటిలో అధికమైన దానమేదో నాకు తెలియజేయుము. (అను. 2. 349)

విజ్ఞానవంతుడికి వినయ పూర్వకంగా ధనం, ధాన్యం, ఆవులు, రత్నాలు, భూములు, నీరు, అన్నం మొదలైనవి ప్రేమతో ఇవ్వడం మంచి యజ్ఞం. ఇవి చక్కగా నడిపినవాడు యజ్ఞాలూ, తపస్సులూ మొదలైనవాటి పుణ్యాలన్నీ పొందుతాడని సమాధానం ఇస్తాడు.

దానాలన్నిటిలోకీ భూదానం గొప్పది. ఎంచేతనంటావా? సమస్తమైన ధన్యాలూ, వస్త్రాలు, ధనరత్నాలూ అన్ని భూమిలోంచే పుడుతున్నాయి. బంగారం, వెండి, వస్త్రాలు, ధాన్యం వివిధ రత్నాలూ దానం చేస్తే ఎంతో భూమి దానం చేస్తే అంత. అందువల్ల భూదానం చేసినవాడికి ఇవన్నీ దానం చేసిన ఫలం లభిస్తుంది.

దాన స్వభావం కలవారికి దానం చేయటానికి తగిన వస్తువులేవి? (ఆను. 2. 368)
అన్నం కంటే విశిష్టమైనది లేదు. దేవతలు, ఋషులు అన్నాన్ని పొగడుతున్నారు. లోకయాత్రలో యజ్ఞయాగాదులు మొదలైనవన్ని అన్నంతోనే ప్రవర్తిస్తున్నాయి.

"అన్నదాన సదృశ మగు దాన మెందు నె / న్నడును లేదు గావునను విధేయ
మన్నదాన మధిక యత్నపూతంబుగా / బూని దానిచేత పుణ్యతమము" (ఆను. 2. 370)

అన్నదానంతో సమానమైనది లేదు. కాబట్టి అది తప్పక చేయదగింది. ఎక్కువ ప్రయత్నంతోనైనా సరే పవిత్రంగా చేయటం ఎక్కువ పుణ్యమిస్తుందని ఈ పద్యం తెలియజేస్తుంది. **"అన్నమయములైన వన్ని జీవములు / కూడులేక జీవ కోటి / కూడు తినెటి కాద కుల భేదమేటికో కాలికాంబ హంస కాలికాంబ"** వంటి శతకాలు కూడా మనకు అదే బోధించాయి.

"ఏ నక్షత్రంలో ఏ దానం చేస్తే మేలు..." (2-377) **"కార్తె బాయస మబ్బగర్భుని తార మాషములు..."** (అను. 2.378,379) కృత్తికలో పాయసం, రోహిణి నక్షత్రంలో మినుములు, మృగశిరలో మాంసాన్నం, ఆర్ద్రలో ఆవు ఇలా అన్ని నక్షత్ర దానాలూ సద్గతులను కల్గిస్తాయి అంటారు.

"తాతా ! శ్రాద్ధాదులలో గొడుగులు, చెప్పులు దానం చేయడం చాలా మంచిపనిగా చెప్పుతారు. వాటి సంగతి చెప్పుము" అని ధర్మరాజు భీష్ముడిని అడుగుతాడు. అప్పుడు భీష్ముడు 'సూర్య జమదగ్ని సంవాదం' తెలియజేస్తాడు. జమదగ్ని వినోదం కోసం ఒకనాడు విల్లు బాణాల పొది తీసుకొని భార్య రేణుకతో బయటకు బయలు దేరుతారు. వినోదంలో భాగంగా జమదగ్ని బాణాలు పడవేస్తు ఉండగా రేణుక తీసుకు వచ్చి ఇస్తుంది. ఈ ఆట సాగుతుండగా మధ్యాహ్న సమయం అయింది. సూర్యునిరశ్మి తీవ్రత వల్ల రేణుక బాణాలు తేవడం ఆలస్యం అయింది. చెమట పట్టింది.

దీనికి కారణాన్ని తెలుసుకున్న జమదగ్ని కోపోద్రిక్తుడై సూర్యుడిని నేలపై కూలవేస్తాను అంటాడు. సూర్యుడు వెంటనే బ్రాహ్మణవేషం ధరించుకుని వచ్చి సూర్యుడి వల్లనే సమస్త జీవరాశులకు నీరు, ఓషధులు లభిస్తున్నాయి అని చెప్పినప్పటికి శాంతించ లేదు. భయపడి వెంటనే నేనే సూర్యుడనని ప్రకటించుకున్నాడు. శరణు కోరుతున్నాను రక్షించుమనగా శాంతించాడు. వెంటనే సూర్యుడు **"ప్రమదంబునన్ గొడుగు జెప్పులు మానస వృత్తి దెచ్చి యమ్ముని కడబెట్టి యత్తరణి మున్నివి లేవని పల్కి దీన మై దనుకడు, వీన బాదముల దాకదు నాదగు వేడి యేమియున్" (అనుశా. 3.263)** వారి సంకల్పంతో గొడుగు, చెప్పులు సృష్టించి ఇచ్చాడు. ఇవి నా వేడి నుంచి కాపాడుతాయి అని చెప్పగ సంతోషించారు.

వీటిని సూర్యుడి మానస సృష్టి, మహర్షి మన్ననా పొందినవి అయిన ఈ మంచి వస్తువులను విద్యావంతుడికి, యతులకూ, సాధువులకు, పెద్దవయస్సు వారికి, మంచి మానవులకు దానం చేయుము. అది మిక్కిలి సారం గల ధర్మం సుమా! దానితో గోలోకం మొదలైన పుణ్యలోకాలు లభిస్తాయి అని చెప్తూ ఈ రెంటిని దానం ఇవ్వడం వల్ల దేవతల మన్ననకు యోగ్యమైనదని పండిత వరేణ్యులంటారు.

పరోపకార సిద్ధాంతం (Theory of Altruism) ప్రకారం దానం అనేది ప్రతిఫలాపేక్ష లేకుండా అవసరార్థులకు, సత్పాత్రులకు శ్రద్ధ, ప్రేమ, వినయంతో

చేయవలసిన సామాజిక-నైతిక కర్తవ్యం. భీష్ముడు దానపాత్రుల లక్షణాలు, దాన విధానం, అన్నదానం, భూదానం పండి దానాల ప్రాముఖ్యతను వివరించడం ద్వారా సమాజ శ్రేయస్సు, పరస్పర సహకారం, మానవీయ విలువలను ప్రతిష్ఠించాడు. అలాగే నిష్కామ కర్మ సిద్ధాంతం (Theory of Selfless Action) ప్రకారం దానం ఫలాపేక్షతో కాక, ధర్మబుద్ధితో, అంతఃకరణ శుద్ధితో చేయాలి. తైత్తిరీయోపనిషత్తు చెప్పిన "శ్రద్ధయా దేయమ్", భగవద్గీతలోని సాత్విక దాన భావన కూడా ఇదే సూత్రాన్ని బలపరుస్తాయి. ఈ పర్వంలో దానం అనేది ధనప్రదానం కాక, వ్యక్తి నైతికత, కరుణ, త్యాగబుద్ధి, సామాజిక బాధ్యతలను ప్రతిబింబించే ధర్మసాధనగా, లోకక్షేమాన్ని సాధించే ఆధ్యాత్మిక, సామాజిక విలువగా చూడవచ్చు.

3. కులాలు – బ్రాహ్మణులు

మహాభారతం చదువుతుంటే చాలా వరకు బ్రాహ్మణుల చరిత్ర చదువుతున్నట్లు, బ్రాహ్మణుల మాహాత్మ్యాన్ని తెలియజేస్తూ వారి రక్షణార్థం రాసినట్లు అనిపిస్తుంది. కాని ఇక్కడ బ్రాహ్మణులు అంటే కులబ్రాహ్మణులు కాకుండా బ్రహ్మజ్ఞానులు, విజ్ఞులు అనే అర్థం తీసుకున్నపుడు వారిని రక్షించుకునే బాధ్యత ఉన్నట్లుగా భావించవచ్చు.

ఈ పర్వంలో చాలాచోట్ల బ్రాహ్మణులను గురించి చెప్పారు. అందులో **"క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలవారికి గుణకర్మలతో బ్రాహ్మణత్వం సిద్ధిస్తుందా"** (అను. 1.86) అనే ప్రశ్నకు భీష్ముడు 'ఇంద్ర మతంగ సంవాదం'. తెలియజేసాడు. అందులో మతంగుడు అనే పేరు గల ఒక బ్రాహ్మణుడు ఒక యజ్ఞం చేయడం కోసం దారి వెంట వెళతాడు. ఆ దారిలో కనిపించిన ఒక గాడిద పిల్లను కొడ్తాడు. గాడిదపిల్ల వెళ్ళి దాని తల్లికి చెప్తుంది. ఆ గాడిద పూర్వజన్మ పుణ్యవాసనతో మతంగుడిని **"వీఁడు చండాలుండు ప్రచండ స్వభావుండు గాకుండునే?..."** (అను. 1.90) అని తిడుతుంది. గాడిద తిట్లను తెలుసుకున్న మతంగుడు వెళ్ళి గాడిదను అడగుతాడు. ఆ గాడిద మతంగుడి తల్లి మంగలిని కలవడంతో పుట్టినట్లుగా చెప్తాడు. దానికి దుఃఖించి అతడిది బ్రాహ్మణ బీజం కాకపోవడంతో "బ్రాహ్మణ్యంబు దపంబున సంపాదించెదంగాక యని పల్కి వీడ్కొన వనంబునకుం బోయి..." (అను. 1.92) తపస్సు చేసి బ్రాహ్మణత్వం సంపాదిస్తానని అడవికి పోయి ఘోర తపస్సు చేసాడు. తపస్సుకు మెచ్చి ఇంద్రుడు వచ్చి వరం కోరుకో అంటాడు. "ధరామరత్వమి'మ్మనియె..." (అను. 1.94) అపుడు ఇంద్రుడు **"బ్రాహ్మణత్వము మహత్త్వ మెఱుంగవ? యన్యజాతి కందునె యది?..."** (అను. 1.95)

అన్యజాతి వారికి బ్రాహ్మణత్వం అందదంటాడు. ఒక జాతివాడు మరొక జాతివాడుగా కావాలంటే ఎంతటి తపస్సు చేయాలనే సంఖ్యను చెప్తాడు. మతంగుడు అప్పటికి ఒంటికాలి మీద నిలిచి నూరేళ్ళు తపస్సు చేసాడు. ఇంతటి తపస్సును చండాలుడు 10 వేల రెట్లు చేస్తే శూద్రుడౌతాడు. 100 రెట్లు చేస్తే వైశ్యుడు. 1000 రెట్లు చేస్తే క్షత్రియుడు. 10,000 రెట్లు చేస్తే దుర్బ్రాహ్మణుడు. 1,00,000 రెట్లు చేస్తే బ్రాహ్మణుడు అవుతాడని చెప్పడం కనిపిస్తుంది.

"విశ్వామిత్రుడు బ్రాహ్మణత్వం ఎలా పొందగలిగాడు" (1-103) **"వీత హవ్యుడనే రాజు బ్రాహ్మణత్వాన్ని పొందాడు అంటారు"** (1-119)**"బ్రాహ్మణుడికి ఏదైనా ఇస్తానని మాట ఇచ్చి ఇవ్వని వాడు ఏ గతి పొందుతాడు"** (1-272) దీనికి ఒక కథ చెప్పాడు. బ్రాహ్మణులకు ఇస్తానని ఇవ్వక పోవడంలో ఈ జన్మలో నక్కగా పుట్టి పీనుగులను పీక్కతింటున్న నక్కా కోతుల కథ.

"బ్రాహ్మణుడు దాన యోగ్యుడు కావటం వారి వృత్తి విశేషంతోనా? లేదా విరక్తుడై వ్రతకం వలననా?" (2-31) తన కులానికి తగిన ఆచార వ్యవహారాలతో బ్రతుకుతూ మనస్సులో సర్వచిహ్నాలకు అతీతుడైనవాడు దానయోగ్యుడు అని ఏక వాక్య సమాధానం కనిపిస్తుంది.

"విప్రుడి సొమ్ము దొంగలించిన వాడి గతి ఏమిటి?" (4-42) వారి ధనాన్ని దొంగిలిస్తే కులనాశం జరుగుతుంది. మరుజన్మలో ఛండాలుడు అవుతాడు అని ఒక కథ చెప్పాడు. అది ఒక మాల వ్యక్తి బ్రాహ్మణుల పొలం నుండి వస్తున్న దుమ్మును తప్పించుకొని పరుగెత్తున్నాడు. దానిని చూసి ఒకరు ఎందుకు పరుగెత్తుతున్నావు అన్నాడు. అతడు పోయిన జన్మలో బ్రాహ్మణుడు. భిక్షాటన చేసుకుని వచ్చి ఒక చెట్టుకింద కూర్చుని తింటున్న సమయంలో బ్రాహ్మణుడి చేనులో నుండి దుమ్ము వచ్చి పడింది దానిని తిన్న. ఆ పాపం వల్ల ఈ జన్మలో చండాలుడిగా జన్మించాను అని చెప్పాడు.

"పూజా నమస్కార గౌరవాలు ఎవరికి చేయాలి?" (5-335). పూజ, నమస్కారాలకు బ్రాహ్మణులు తగినవారు. వారికి అశుభం కలిగించకూడదు. వారికి సంతోషం కలిగితే అన్ని శుభాలు కలుగుతాయి.

"బ్రాహ్మణులలో మెచ్చుదగిన ప్రవర్తన ఏముంది?" (5-337) కార్తవీర్యార్జునుడికి వాయువు బ్రాహ్మణశక్తి వలనే రాజులు ప్రజలను రక్షిస్తున్నారనీ, బ్రాహ్మణులను

మించినవారు లేరని పేర్కొన్నాడు. గౌతముడు, భృగుమహర్షి ఉచథ్యుడు.. మొదలైన వారి మహిమలు చెప్పి బ్రాహ్మణులను దైవ్వరూపులుగా భావించాలని చెప్పాడు.

మొత్తం ప్రశ్నలలో ఒక దానికి మాత్రమే శ్రీకృష్ణుడు చెప్పాడు. అది బ్రాహ్మణుల గురించి. ప్రద్యుమ్నుడికి చెప్పిన విషయాలనే నీకు వివరిస్తాను అంటాడు. మోక్షాన్ని సాధించాలన్నా, పితృదేవతల దయ పొందాలన్నా, ఐహిక సుఖాలు గడించాలన్నా బ్రాహ్మణులను ఆశ్రయించాలి. ఆయురారోగ్యాలు వారి వలన లభిస్తాయి. కోరితే వరాలు, కోపిస్తే భస్మం చేయగలరు.

ఇతర కులస్త్రీలను బ్రాహ్మణులు పెండ్లి చేసుకుంటే పెండ్లాడితే వారికి పంచివ్వాల్సిన భాగాలను గురించి కూడా వివరించారు.

ఈ అంశాన్ని 'గుణ-కర్మ సిద్ధాంతం' కోణంలో ఆలోచిస్తే బ్రాహ్మణత్వం కేవలం జన్మ ఆధారంగా కాక, తపస్సు, స్వధర్మాచరణ, సత్యం, దమం, శీలం, విజ్ఞానం వంటి ఉన్నత గుణాలు, కర్మల ద్వారా పరిపుష్టి చెందే ఆధ్యాత్మిక స్థితిగా భారతం వివిధ సందర్భాల్లో వివరిస్తుంది. అలాగే 'జ్ఞానాధికార సిద్ధాంతం' ప్రకారం బ్రహ్మజ్ఞానులు, ఋషులు, తత్వవేత్తలు సమాజానికి ధర్మమార్గాన్ని చూపే మార్గదర్శకులు; అందువల్ల వారికి గౌరవం, దానం, రక్షణ కల్పించడం ద్వారా ధర్మవ్యవస్థ, సామాజిక శాంతి, నైతిక విలువలు నిలబడతాయని ఈ ప్రశ్నోత్తరాలు ప్రతిపాదిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారతంలో బ్రాహ్మణుల ప్రాశస్త్యం కులపరమైన ఆధిక్యాన్ని సూచిస్తూనే, జ్ఞానం, తపస్సు, ధర్మాచరణ, నైతిక నాయకత్వానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రతిబింబించే తాత్విక భావనగా అర్థం చేసుకోవచ్చు.

4. స్త్రీ

స్త్రీ' అనే పదానికి వ్యుత్పత్తిని చెబుతూ నిఘంటుకారులు చాలా అర్థాలు చూపించారు. అందులో ముఖ్యంగా 'సూతీ' లేదా 'సోత్రీ' అనే ధాతువుల ఆధారంగా 'స్త్రీ' పదం ఏర్పడింది. ప్రసవ కారకం అయిందిగా భావిస్తున్నారు. మరికొందరు 'స్త్రీ' అనే పదం 'స్త్యై' ధాతువునుంచి ఉత్పన్నమైనట్లు భావిస్తున్నారు. యాస్కాచార్యులు నిరుక్తంలో 'స్త్రియః స్త్యై యతే' (నిరుక్తమ్ -3.21.2) అంటూ చెప్పి లజ్జాశీలమైన ప్రవృత్తి వల్లనే 'స్త్రీ'గా వ్యవహరిస్తున్నట్లు సూచించారు. పాణిని ఈ 'స్త్యై' ధాతువును గూర్చి 'స్త్యై శబ్ద సంఘాతయోః" (పాణినీయమ్ -ధా.పా.2.935) అన్నాడు. ఈ ఆధారంతో అధికంగా మాట్లాడేది 'స్త్రీ' అంటూ జనశ్రుతి ఏర్పడింది. పతంజలి 'స్త్రీ'ని

గురించి 'స్యాయతి అస్యాం గర్భ'(మహాభాష్య-65) అంటే 'గర్భస్థితి వల్లనే స్త్రీ శబ్దం స్త్రీకి సంకేతితం ఐనట్లు భావించవచ్చు. పతంజలి ఈ 'స్త్రీ' శబ్దాన్ని పురస్కరించుకొని వ్యాఖ్యానిస్తూ 'శబ్దస్పర్శ రూపరస గంధానా స్యానం స్త్రీ' అంటూ కూడా వ్యాఖ్యానించాడు. ఈ చర్చల ఆధారంగా 'స్త్రీ' ప్రధానంగా ఆమె గర్భధారణ స్థితివల్లనే స్త్రీగా సంకేతింప బడినట్లు గ్రహించవచ్చు. ఈ స్త్రీకి సంబంధించిన అంశాలు కొన్ని ఈ పర్వంలో కనిపిస్తున్నాయి. **"స్త్రీల సమాచారాలను వినగోరుతున్నాను చెప్పగలరు"** (4-354) దీనికి సమాధానాన్ని భీష్ముడు 'కైకేయీ శాండిలీ సంవాదం' ద్వారా తెలియజేస్తాడు. కైకేయీ రాజపుత్రి సుమన అమరావతిలో శాండిలిని చూసి, నీకు ఇంతా శ్రేష్ఠమైన దేవలోక నివాసం ఎలా కలిగింది అంటుంది. అప్పుడు ఆమే "అత్తమామలకు ఎదురు చెప్పను, దేవపూజలు, శ్రాద్ధములు, అతిథి సపర్యల అనే పనులలో ఎడమొగం పెట్టను. వీథి వాకిలి తెలియకుండా ఉంటాను. పకపకా నవ్వను. భర్తకు ఇష్టమైన వంటలు చేసి పెడ్తాను. భర్త ఊరు వెళితే వచ్చేవరకు పూలు, మైహూతలు, మంచి చీరలు, నగలు, రుచి పాకాల భోజనాలు ఆదరింపను, ఏ విధంగాను ధాన్యపు గింజలను, అన్నాన్నీ వ్యర్థ పరచను. బంధువులను తగువిధంగా ప్రీతి కలిగిస్తాను.

పైన పేర్కొన్న విషయాలు సార్వకాలీన అంశాలు కావు. ఈ విషయాలన్ని భారత కాలంనాటి స్త్రీ పరిస్థితులను, స్త్రీని పురుషుడు చూస్తున్న తీరును తెలియపరుస్తాయి. భారతీయ సమాజం స్త్రీని పైన పేర్కొన్న పరిస్థితులలో నుంచి భయటకు తీసుకురావడానికి ఎంతో సంస్కరణ యుద్ధం చేయవలసి వచ్చింది. అయినప్పటికీ ఇంకా కొన్ని కులాల సంప్రదాయాలలో స్త్రీలు భారత కాలం నాటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారనడంలో ఆశ్చర్యపోవల్సిన అవసరం లేదు.

'వనితా ధర్మం ఎట్లాంటిదో నీ వలన తెలియవలెననే కుతూహలం నా హృదయంలో కలిగింది. కనుక స్త్రీ ధర్మం ఎట్టిదో నీవు చెప్పాలి" అంటాడు.

"కన్యాదానానికి ఎట్లాంటి వరుడు కావాలి?" (2-2) అష్టావక్రుడి వృత్తాంతాన్ని తెలియజేస్తాడు.

"బాల్యమున దండ్రి యౌవన ప్రాప్తి మగడు / వార్ధకంబున దనయుడు
నరసి నడపన కాకెందు సంగనలకు / వలసినట్లులు సేయగా వచ్చు నెట్లు?" (2-22)
వంటి పద్యాలు ఆలోచింపచేస్తాయి.

"పాపాలన్నిటికి మూలం స్త్రీలు అంటారు వారి సంగతి చెప్పుము" అని ధర్మరాజు భీష్ముడిని ప్రశ్నిస్తాడు. **"స్త్రీ పురుషులు శృంగారంలో ఎవరికి ఎక్కువగా సుఖం ఉంటుంది"** (1-286) దీనికి భంగాస్వనుడు అనే రాజు కథ ద్వారా వివరిస్తాడు.

దాంపత్య, గృహ నిర్వహణ, వంటి బాధ్యతలను స్త్రీధర్మంగా భారతం ప్రతిపాదించింది. కైకేయి-శాండిలీ సంవాదంలో ఆదర్శ గృహిణి లక్షణాలను వివరించడం ద్వారా ఆ కాలపు సామాజిక నిర్మాణం, కుటుంబకేంద్రిత విలువలు ప్రతిబింబిస్తాయి. మరోవైపు స్త్రీవాద దృష్టిలో ఈ వర్ణనలు స్త్రీని పురుషాధిక్య సామాజిక వ్యవస్థలో నిర్దిష్ట పాత్రలకు పరిమితం చేసిన చారిత్రక దృక్పథాన్ని సూచిస్తాయి. అందువల్ల ఈ అంశాలను శాశ్వత సత్యాలుగా కాకుండా, భారతకాల సమాజంలోని లింగ సంబంధాలు, సాంస్కృతిక విలువలు, సామాజిక పరిస్థితులకు ప్రతిబింబాలుగా అర్థం చేసుకోవాలి.

5. శ్రీ / లక్ష్మి

శ్రీ అనే పదానికి నిఘంటువులు 'లక్ష్మి, సంపద, ఐశ్వర్యము, త్రివర్గము, వృద్ధి, శోభ, అలంకరణము, కీర్తి, బుద్ధి, ఉపకరణము, సరస్వతి, కాంతి, గౌరవ వాచకము, బ్రహ్మవిద్య, పద్మం' వంటి అర్థాలను అందిస్తున్నాయి. (ఆంధ్ర భారతి.కామ్) వ్యుత్పత్తి ప్రకారం, శ్రీ+క్విప్, శ్రయతి హరిమ్ = హరిని ఆశ్రయించునది. శ్రీ+ క్విప్, క్రియతే ఆశ్రియతే జీవికార్థమ్ = జనులు జీవిక కొరకు ఆశ్రయించునది' (ఆంధ్రభారతి.కామ్) అని తెలుస్తుంది.

"లక్ష్మి ఎటువంటి జనులలో ఉంటుంది" (1-282) నిత్యం సత్యం చెప్పేవారు, శుచి కలవారు, గురుభక్తులు, మత్తులు కానివారు, కార్యసాధకులు, స్వచ్ఛమైన మనస్సు కలవారు, మంచి కర్మలు చేసేవారు, విజ్ఞానం, తపస్సు, దానం, బ్రహ్మచర్యం, ఇంద్రియ నిగ్రహం కలవారు నేను ఉండే స్థలాలు.

ఉండని స్థలాలు : క్రూరులు, నాస్తికులు, చెడ్డబుద్ధి కలవారు, భర్తను ఎదిరించి స్త్రీ కఠినమైన మనసుకలది. కొంపల వెంట తిరిగేది. ఎక్కువ నిదురపోయేది.

"ఆవుపేడలో లక్ష్మి ఉంటుందని నేను విన్నాను. దానికి కారణం ఏమిటి?" అని అడిగాడు. ఆ ప్రశ్నకు జవాబుగా **'గో శ్రీ సంవాదం'** ను వినిపిస్తాడు.

'సిరి ధేనువులలోని కరిగిన నెవ్వత?....'(ఆనుశా. 3. 114) ఒకప్పుడు లక్ష్మి గోవుల మందలోకి వెళ్ళింది. ఆవులు 'నీవెవరవు?' అని అడిగాయి. ఆమె 'నేను లక్ష్మిని మీతో

కలిసి ఉందామని వచ్చాను' అన్నది. అప్పుడు ఆ గోవులు 'నీవు చంచల స్వభావం కలదానివి కాబట్టి మాలో ఉండడానికి ఇష్ట పడము' అని చెప్తాయి. లక్ష్మి దుఃఖంతో 'నేను వదలిపోతే రాక్షసులందరు చెడిపోయారు. నేను చేరటం వల్ల దేవతలు విజయం పొందారు. నా రాకను కోరే కదా మనుజులంతా తపస్సులు చేస్తారు. నన్నిట్లా అవమానించటం తగునా?' అని అడిగింది. అప్పుడవి స్థిరత్వం లేని దానిని మేమిష్టపడం అనటం అవమానమా? నీకు తోచిన చోటికి వెళ్ళుము' అంటాయి. తరువాతి పద్యాలలో లక్ష్మి 'మీరు నన్ను ఈ విధంగా అవమానించినట్లైతే ఎలా మీరే నాకు ఎట్లయినా ఆశ్రయం ఇవ్వండి, మీ దగ్గరే ఉండాలనుకుంటున్నాను' అంటుంది. అప్పుడు గోవులన్ని

"మా మూత్ర పురీషంబులు...." (అనుశా. 3. 117) మా మల మూత్రాలు పరమ పవిత్రాలని వేదాలకు తెలుసు. నీవు ఈ గొప్ప వస్తువులలో మాకు ప్రీతి కలిగే విధంగా మంచి నివాసం కలదానివై ఉండుమంటాయి. 'నా పుణ్యం, మీ దయ వల్ల ఇంతటి స్థానాన్ని పొందగలిగాను' అంటూ అందులో నివాసానికి లక్ష్మి అంగీకరించింది. ఈ సమాధానం ద్వారా అందిన సందేశం ఏమిటంటే లక్ష్మి అంటే ఒక దబ్బు మాత్రమే కాదు. పవిత్రత, ఆరోగ్యం, మంచి ఆలోచన మొదలైనవన్ని. ఇలాంటివి ఎందులో లభిస్తాయో అదే లక్ష్మిగా నిర్ణయించుకోవాలి.

ఈ సమాధానంలో అంశం కొంత సాధారణంగానే అనిపిస్తుంది. కాని దానిని అన్ని వర్ణాల వారు, వర్ణాలవారు ప్రాముఖ్యత ఇస్తున్న అంశం. ఇప్పటికి పెండను నీళ్ళలో కలిపి ప్రతి ఇంటిముందు చల్లుకుంటున్నాం అంటే అందులో ఉన్న సైన్సు కొంత అర్థమయిందనిపిస్తుంది. ఆవు పెండను పిడకలుగా తయారుచేసి కొన్ని వర్ణాలవారు హోమం పేరుతో ఇంట్లో కాలుస్తుంటారు. అందులో క్రిమి సంహారశక్తి వంటిది ఉందనే విశ్వాసం. పెండ ఒక రకంగా మనిషికి ఆరోగ్యాన్ని ఇస్తుంది. మనిషికి ఆరోగ్యానికి మించిన ధనం లేదు.

గో-శ్రీ సంవాదంలో ఆవు, గోమయం, గోమూత్రం వంటి అంశాలు పవిత్రత, ఆరోగ్యం, శ్రేయస్సు, ప్రకృతి ఆధారిత జీవన విధానాలకు ప్రతీకలుగా చిత్రించబడ్డాయి. ఈ ప్రతీకల ద్వారా సమాజం లక్ష్మిని కేవలం భౌతిక సంపదగా కాకుండా, ఆరోగ్యం, పరిశుభ్రత, శుభసంకల్పం, ప్రకృతి సంరక్షణ, సామూహిక శ్రేయస్సుతో ముడిపడిన సమగ్ర జీవన విలువగా అర్థం చేసుకున్నట్లు తెలుస్తుంది. అందువల్ల భారతంలోని లక్ష్మి భావన నైతిక గుణాలు మరియు సాంస్కృతిక ప్రతీకల సమన్వయంతో వ్యక్తి, సమాజ శ్రేయస్సును ప్రతిపాదించే తాత్విక దృష్టిగా నిలుస్తుంది.

6. ఆచారం

ఆచారం గురించి భారతంలో ఏడు అర్థాలలో వాడినట్లు కనిపిస్తుంది. 1. నియమం 2. ఆచరించుట, అనుష్ఠించుట 3. ధర్మం 4. శీలం 5. నడవడి, ప్రవర్తనం 6. విధి, కృత్యం 7. సంప్రదాయం అనేవి. వీటితో పాటు భారతమే వేదాల ఆధారంగా ఆచారానికి నిర్వచనం వంటి వాక్యాన్ని అందించింది.

"వేద మాచారములఁ జెప్పు వివిధ గతుల / సకల హితమగునట్టి యాచార మరయ / ననఘ! వేఱొండు గలదె? మహాత్ములెద్ది / యాచరించిరి దానిఁ జేయంగ వలయు" (శాంతి. 5.221) అనే పద్యం ద్వారా ఆచారం అనేది ప్రత్యేకమైనదేమి కాదు. మహాత్ములైనవారు దేనిని పాటిస్తారో దానిని మిగతా వారు పాటించాలి అని ఆదేశిస్తుంది. ఇదే భావాన్ని భగవద్గీతలో **'యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః...'** (భగవద్గీత. 3.21) అనే శ్లోకం తెలియజేస్తుంది. అంతేకాదు విష్ణుపురాణం **"సాధవః క్షీణదోషాః స్యుః ..."** (వి.పు. 3-10-3) అనేది సజ్జనులు అంటే ఎవరో తెలిపి, సాధు, సజ్జనుల ఆచరణను సదాచారం అంటారని వివరించింది. ఆచారాలను పాటించటం వల్ల మానవులు దీర్ఘాయుష్మంతులు, ఉత్తమ సంతాన వంతులగుతారు. ధన సంపదలను పొందుతారు. దోషాలను, చెడు లక్షణాలను పొగొట్టుకుంటారు. స్వర్గసుఖాలు, కీర్తి పెంపొందుతాయని **"ఆచారాల్లభ్యతేహాయుఃఁ...."** (మనుస్మృతి.అ.4-155,156) అనే శ్లోకాలు తెలియజేస్తున్నాయి. ఆచారాలను పాటించని దురాచారులు నిందకు పాత్రులగుతారు. అనారోగ్యాన్ని, దుఃఖాన్ని పొందుతూ అల్పాయుష్మంతులు అవుతారని విష్ణుధర్మోత్తర పురాణం (శ్లోకం.271-1) ఉల్లేఖించింది. ఈ విషయాలను ఆనుశానిక పర్వంలో ప్రశ్నోత్తరాలతో తెలియజేసారు.

"ఆచారం అంటే ఏమిటి? దేని చేత ఆయువు వృద్ధిపొందుతుంది? దేనిచేత తరిగిపోతుంది?" (4.86) "సాధు జనులు పోవు తెరువు సంభావించుట యాచారము..." (4-89) సాధుజనులు నడిచిన మార్గంలో నడవడమే ఆచారం. చెడు నడక అనేది సజ్జనులను, దుర్జనులనూ ఇరువురినీ కష్టపెడుతుంది. కాబట్టి నడతను గురించి వినటం మిక్కిలి మంచిది. ఆచారం ఆయువును పెంచుతుంది, సంపదను, కీర్తిని కలుగజేస్తుంది. ఆచార విహీనులు ఆయుర్వృద్ధిని పొందలేరు. సర్వభూతాలూ వారిని తిరస్కరిస్తాయి. ఆచారం వర్ణాశ్రమాలకి అనుగుణంగా ఉండాలి అంటూ భీష్ముడు సమాధానం చెప్పడం మొదలుపెట్టాడు. దీనికి చాలా పెద్దగా జవాబు చెప్పాడు.....

1. 'నిత్యం తల్లిదండ్రులకు, గురువులకు, విజ్ఞానులకు, దేవతలకు నమస్కారం చెయ్యాలి. తల్లికీ, తండ్రికీ, సంతానానికి అన్ని విధాల హితమైన మాటలే పలుకుతూ ఉండాలి. గురువుల మాటను లెక్కచేయకపోవడం, గురువుతో నిర్బంధం, విరోధం మంచిది కాదు. అతడు కోపించినా అనుసరిస్తూ ప్రసన్నుడిని చేసుకోవడం మంచిది. గురువును నిందించటం, అతడి విషయాలలో అబద్ధాలు చెప్పటం ఆయువును బాగా తగ్గించి వేస్తాయి' అంటాడు.

2. 'ప్రతి ఉదయం దేవతలను అర్చించాలి. వారివారి స్థాయిలో వ్రతాలు చేయాలి. పేదరికంలో ఉన్న అక్కచెల్లెళ్ళను, గురువునీ, స్నేహితుణ్ణి, తన వంశంలోని వారిని తెచ్చి ఇంట్లో పెట్టుకుని, ప్రేమతో పోషిస్తే ఆయువు పెరుగుతుందనే విషయాలు కూడా ఇట్లాంటివే.

3. మనకు పోషకాన్ని ఇచ్చి, బలాన్ని చేకూర్చే ఆహారం ఏవిధంగా తీసుకోవాలో చెప్పినారు. 'కాళ్ళు కడుక్కొని, తూర్పుముఖంగా కూర్చుని భోజనం చేయాలి. నిలబడి చేయకూడదు. పగిలిన పీటమీద, పగుళ్లు వచ్చిన కంచంలో తినకూడదు. పరధ్యానంగా భోజనం చెయ్యద్దు. సంధ్యా సమయాల్లో తినకూడదు. హితం కానిచోట తినకూడదు. ఇతరులు చూసిన పదార్థాలూ, వాసన చూసిన పదార్థాలు, నింద్యమైన పదార్థాలూ తినకూడదు. ఒక్కపాత్రలో కలిసి తినకూడదు. ఒకరు చూసిన పదార్థం వారికి పెట్టకుండా తినకూడదు. చుట్టాల్ని భోజనానికి పిలిచి, వాళ్ళకు ఒకవిధంగా పెట్టి, వీళ్ళు మరోలా తినడం పాపం. అలాంటి తిండి విషపు తిండే అవుతుంది. పిలవకుండా విందు భోజనానికి వెళ్ళకూడదు. తినకూడని పదార్థాలు మర్రిపళ్ళు, రావిపళ్ళు, మేడిపళ్ళు. పగవారున్నచోట ఆవు మాంసం, మేక మాంసం, నెమలి మాంసం తినద్దు. ఉప్పును చేతితో, రాతిమీద దంచుకుని తినకూడదు. రాత్రి వేళలో పెరుగు, తేనె, పేలపిండి తినకూడదు. ఎంగిలి చేతితో అగ్నిని, ఆవును, విప్రుడిని ముట్టరాదు. తాను తినగా మిగిలిన నేయి, తేనె, పేలపిండి, పెరుగూ, పాయసమూ, మంచి నీళ్ళు ఎవ్వరికీ పెట్టకూడద'ని బోధించాడు. 'ఆహార సంభవో వస్తుః రోగాస్త్వామారసంభవాఃʼ ఆహారం వల్ల శరీరం ఏర్పడుతుంది. శరీరానికి రోగాలు కూడా ఆ ఆహారం వల్లనే కలుగుతాయని చరకుడు చెప్పిన సూత్రం తెలిసిందే.

4. 'తడి కాళ్ళతో, పరిశుభ్రత లేకుండా, చినిగిన పక్కమీద, ఉదయం, సాయంకాలం నిద్రపోకూడదు. ఉత్తరం వైపూ, పడమటివైపూ తలపెట్టుకుని నిద్రపోకూడద'ంటాడు.

5. 'పురుషుడు కులమూ, రూపమూ, శీలమూ గల కన్యని వరించాలి. ఆమెకి కలిగిన సంతానానికి దైవ పిత్ర క్రియలతో తగిన విధంగా శుభకార్యాలు సాగించాలి. సంభోగ క్రియను గుప్తంగా ఉంచాలి. పెళ్ళికాకుండా సంభోగసుఖం అనుభవిస్తే అవకీర్ణ అంటారు. కడుపుతో వున్న ఆడవారితో కలువకూడదు. ఇతరుల భార్యలను పొంద కూడదు. పగలు సంభోగం కూడదు. శీలం చెడిన స్త్రీ పొందు కూడదు. పతితను, రజస్వలను, నగ్నస్త్రీని చూడకూడదు. అమావాస్య, చతుర్దశి, ద్వాదశి, అష్టమి తిథులలో, జన్మతిథినాడు బ్రహ్మచర్యం పాటించాలి. రజస్వలను ముట్టుకోకూడదు. ముట్టు అయిన భార్య స్నానం చేసిన నాల్గవరోజు రాత్రివేళ కలవడం మంచిదంటారు పూజ్యులు. అయిదవరోజు సమాగమం పొందితే ఆడబిడ్డ, ఆరవనాడు కలుసుకుంటే మగ శిశువు కలుగుతారు. సరిరోజులలో కలుసుకుంటే మగపిల్లవాడు, బేసి రోజులలో ఆడబిడ్డ కలుగుతుంది. ఈ విధంగా పదహారవ రోజు వరకు స్త్రీ ఋతువు వ్యర్థం కాకుండా, ఎన్ని పనులున్నా కలవడం వల్ల ఆయువు పెరుగుతుంద'ని తెలిపాడు.

6. 'పరుషంగా మాట్లాడటం, చాడీలు చెప్పటం దోషాలు. కోపం, హింస, అసత్యం అనేవి లేకుండా చూసుకోవాలి. ఆచారాలు విధానాలు ఎరిగినవారు మాటలలో కటువుతనం, కోపం పాపమంటారు. అవయవాలు లోపించినవారినీ, లేమితో బాధపడే వారినీ, చదువురానివారిని, అందచందాలు లేనివారినీ నిందించటం పాపం. వేదాలను, దేవతలను తూలనాడటం, డబ్బుల కోసం జ్యోతిషం చెప్పటం పాప'మంటాడు.

7. 'పెద్దవారు ఎదురైనపుడు నమస్కారం చేయాలి. నడుస్తున్నపుడు దారిలో ఉత్తమ విజ్ఞానులు, ఆవులు, క్షత్రియులు, ముసలివారు, బలహీనులు, బరువు మోసేవారు, గర్భవతులు వస్తుంటే తాను తప్పుకుని వారికి దారి ఇవ్వాలి. పూజింపదగిన విజ్ఞానులు, మంగళకర వస్తువులు, మంచి చెట్లు కనబడితే వాటికి ప్రదక్షిణం చేసి వెళ్ళాల'ని తెలిపాడు.

8. 'సభలో, పశువుల మందలో, పంటలమీద, ఇంకా ఇతర పవిత్ర ప్రదేశాలలో మలవిసర్జన చేయడం, నిలబడి మూత్రం చేయడం పాపపు పద్ధతులు. పళ్ళు తోమేటప్పుడు, మలమూత్రాలు విసర్జించేటప్పుడూ మాట్లాడకూడదు. అట్లాగే తన మలాన్ని తాను చూస్తే కీడు కలుగుతుంది. చెడు నడవడితో మెలగడం, పిట్టను పిసకటం, పుడకను త్రుంచటం, గోళ్ళను కొరకటం మంచిదికాదు. రెండు చేతులతో తల గోకరాదు. తలమీది నూనెను ఒంటికి పూసుకోరాదు. కాళ్ళు ఒకదానితో ఒకటి తోమరాద'ంటాడు.

9. 'పావురాలు, చిలకలు, మైనగోరలు, పూలతీగలు, వెండి, బంగారాల పరికరాలు ఇంటికి మంగళప్రదాలు. అవి అలంకరణలుగా వుండి, శుభం కలిగిస్తాయి. గువ్వ, గద్ద, దీపమారిపే పురుగు, గుడ్లగూడ ఇవి ఇంట్లో చొరబడితే శాంతిచెయ్యించా'లని పలికాడు.

10 'శుచిగా ఆచమించి నిలకడగా నీట మునగటం, సంధ్య వేళలలో సూర్యుడికి అర్ఘ్యమిచ్చి పూజించటం, పాద్య అర్ఘ్య స్నానాదికాలు ముగిసిన పిదప భుజించటం మంచిది. ఉదయాస్తమయ కాలాలలో సూర్యుడిని చూడడం ఆయువును హరించి వేస్తుంది. ఎంగిలి చేతితో చంద్రుడిని, సూర్యుడిని చూడరాద'ని తెలిపాడు.

11. 'సంధ్యల్లో చదవకూడదు. చదువుకునే సమయంలో తలను తాకకూడదు. రాత్రివేళ స్నానం చేయడం గాని, నీటితో శరీరాన్ని తుడుచుకోవడం గాని చేయరాదు. అది అశుభ్రతకు దారితీస్తుంది. సాన్నం చేయకుండా మైపూతలు వాడకూడదు. తడిబట్టలను విదిలించకూడదు. ఇతరులు కట్టి విడిచిన బట్ట కట్టకూడదు. మడిబట్టను మాటిమాటికి మార్చకూడద'నేవి కూడా కనిపిస్తున్నాయి.

12. 'ఉమ్మినప్పుడు, తుమ్మినప్పుడు ఆచమనం చేయకపోవటం తప్పు. అటువంటి సందర్భాలలో ఆచమనం చేయటం సాధ్యం కాకపోతే సూర్యుడిని చూస్తూ, ఓంకారాన్ని పలుకుతూ, కుడిచెవిని తాకటం పవిత్రతను కలిగిస్తుందని పండితులు చెప్తారు. తూర్పువైపు, లేదా ఉత్తరంవైపు మొహంచేసి కూర్చుని జోతిష్యులు చెప్పిన తిథివార నక్షత్రాలలో మంగలిచే క్షౌరము, అభ్యంగనమూ చేసుకోవడం మంచిది. పువ్వులలో తెల్లటివీ, పసుపచ్చటివీ ముడుచుకోదగినవం' టాడు.

ఈ ఆచారాలను మొత్తంగా ఐదు రాకాలుగా విభజించుకోవచ్చు. అవి : సాంప్రదాయ, సామాజిక, సాంస్కృతిక, మత, వ్యక్తి ప్రవర్తన పరమైనవి. ఇందులో దీర్ఘకాలంగా వస్తున్న పద్ధతులు, నమ్మకాలు, నిర్దిష్ట సంప్రదాయాలు కూడా కనిపిస్తాయి. ఒకటి ఆచారంగా కొంతకాలం కొనసాగింది అంటే దానివల్ల ఆ కాలంలో కొందరికైనా మేలు జరిగినదై ఉందని భావించవచ్చు. వాటన్నిటిని ప్రాంతంతో, వయసుతో, కాలంతో సంబంధం లేకుండా పాటించాల్సిన పనిలేదు. 'సాయంత్రం చదవకూడదు' అన్నారు. కారణం అప్పట్లో సూర్యుడు అస్తమించిన తర్వాత వెలుగు సమస్య ఉండేది. దీపాలు, లైట్లు లేని రోజులు. ఆ రోజుల్లో వేదాలు, శాస్త్రాలు చదవడమే చదువు. వేదశాస్త్రాలు

చదివే వర్గం వారికి సాయంత్రం సంధ్య వార్చుకునే సమయం. ఇవే కాకుండా సాయంత్రం అనేది కాలంలో మార్పు జరిగే సమయం. మరొకటి 'ఐహిష్టను చూడకూడదు' అన్నారు. పూర్వం కావాల్సినన్ని వస్త్రాలు అందుబాటులో లేవు. అటువంటి కాలంలో ఋతుస్రావం అవుతున్న స్త్రీని చూడకూడదు. ముట్టుకోకూడదు అనేది పాటించాల్సిన పద్ధతే. కాని ఇప్పుడు అది పాటించాల్సిన పనిలేదు. కావల్సినన్ని వస్త్ర సంబంధ వస్తువులు ఉన్నాయి. ఇలాంటి వాటిని కొత్తపద్ధతిలో ఆలోచిస్తూ ఆచరించాలి. *వరిధాన్యం మొలకెత్తి పెరగడానికి అందులోని అంకురమే ముఖ్యమని, పైనుండే ఊక అప్రధానమనీ సాధారణంగా భావిస్తారు. కాని ఊకలోని బియ్యపు గింజను నాటితే అది మొలకెత్తి మొక్కై పంటనివ్వదు కదా? పంట కావాలంటే ఊక ఉండి చెక్కుచెదరని విత్తనాలనే నాటాలి. ఆచారాలు ఊక వంటివి. మనిషి జీవన గమనంలో ఒక స్థాయికి వేరేవరకు ఆచారాలు చాలా అవసరం. తర్వాత వారి వారి విజ్ఞానానికి వదిలివేయచ్చు.* మంచి ముత్యాన్ని లోపల వృద్ధిచేసే చిప్పల వంటివి ఆచారాలు. గురజాడ 'కన్యాశుల్కం'లో "జారూ, బురదా, గట్టూ, గతుకులు వున్న తోవ యెలా ఉంటుందో యిప్పుడు మన ఆచారాలు అలా వున్నాయి" అన్నాడు. బీనాదేవి 'టెన్ కెమాండ్‌మెంట్స్'లో "ఆచారాలు ఆకాశంలోంచి రాలలేదు. భూమిలోంచి మొలవనూ లేదు. కేవలం స్వయం కృతాపరాధాలు" అన్నారు. అట్లాంటి వాటిని ఆధునిక కాలంలో పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాలి కూడా.

భీష్మ సమాధానంలో తెలిపిన ఒక మంచి విషయంతో దీనిని ముగించుకుందాం. **'అన్నిటికంటే సర్వ భూతదయ'** గొప్ప ఆచారమంటారు. కాబట్టి అన్ని వర్ణాల, వర్ణాల వారి విషయంలో దయ కలిగి ఉండడమే అందరికీ ఉండవల్సిన గుణం.(అను. 4. 128) వారి వారికి ఉపయోగకరమైన ఆచారాలను పాటించాలి. ఆచారం ధర్మానికి కుదురు. ధర్మం ఆయువును పెంచుతుంది. సంపదను, కీర్తిని వృద్ధి చేస్తుంది.

'విను మాచార మవశ్యం / బును నడపంగ వలయు ధర్మమున కది మూలం
బనఘా! ధర్మం బాయువు / బెనుచును లక్ష్మిని యశంబుఁబెంపొందించున్
(అనుశాసనిక. 4. 127)

పై అంశాలను 'సామాజిక అభ్యాస సిద్ధాంతం' ప్రకారం చూసినపుడు వ్యక్తి సమాజంలోని శ్రేష్ఠులు, గురువులు, పెద్దలు, సజ్జనుల ప్రవర్తనను గమనించి అనుసరించడం ద్వారా సదాచారాన్ని అలవర్చుకుంటాడు. "యద్యదాచరతి శ్రేష్ఠః..." అనే గీతా భావానికి అనుగుణంగా మహాత్ముల ఆచరణే సమాజానికి ఆదర్శమని ఈ పర్వం ప్రతిపాదిస్తుంది.

ఆచారాలు సమాజంలో క్రమశిక్షణ, పరిశుభ్రత, ఆరోగ్యం, కుటుంబ ఐక్యత, పరస్పర గౌరవం, ధార్మిక జీవనం వంటి విలువలను పరిరక్షించి సామాజిక స్థిరత్వాన్ని నిలబెట్టే వ్యవస్థగా పనిచేస్తాయి. అయింతో ఇందులో పేర్కొన్న కొన్ని ఆచారాలు ఆ కాలపు సామాజిక, సాంస్కృతిక, మతపరమైన పరిస్థితులకు అనుగుణంగా రూపుదిద్దుకున్నవి. వాటిలో శాశ్వత మానవ విలువలను స్వీకరించి, కాలానుగుణంగా మార్పు అవసరమైన వాటిని వివేకంతో పునర్వ్యాఖ్యానించాల్సిన అవసరాన్ని కూడా ఈ భావన సూచిస్తుంది.

7. ధర్మం

ఈ పర్వంలో "ధర్మాలు పలువిధాలుగా ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా అనుష్ఠించదగిన ధర్మమేదో తెల్పుము" (అను. 5. 406) అంటే భీష్ముడు... ధర్మం ఇదని ధర్మస్వరూపులు మాత్రమే చెప్పగలరు. కాల పరిణామం వలన ధర్మం అందుకు భిన్నంగా గోచరిస్తుంది. స్పష్టతను కోల్పోయి మరుగున పడుతుంది. సూక్ష్మబుద్ధి లేక పోవడం వల్ల అధర్మం ధర్మమనే తలంపు కలుగుతుంది అంటాడు. నిజమే ధర్మం అనేది ఇది అని చెప్పటానికి ఒక వస్తువులాగా గోచరించేది కాదు. కొన్ని కొన్నిసార్లు కొన్ని పద్ధతులలో కనిపిస్తుంది. ఉదా.

1. మాతాపితల ధర్మము, పుత్రధర్మము, పౌరధర్మము అనుకుంటే ధర్మము కర్తవ్య పరమై కనిపించును.
2. సత్యాహింసాదులు పరమ ధర్మములు అనుకుంటే ధర్మము సదాచారమై గోచరించును.
3. అన్నార్తునకు అన్నము పెట్టుట, దుఃఖితుల నాదుకొనుట ధర్మము అనుకుంటే ధర్మము దయారూపమున దర్శనమిచ్చును.
4. అత్యాచారులను, అపరాధులను దండించుట 'ధర్మము' అనుకుంటే ధర్మము న్యాయరూపములో భాసించును.
5. 'ఋణము తీర్చుట, పరనారిని తల్లివలె చూచుట ధర్మము' అనుకుంటే ధర్మము సామాజిక వ్యవహార పరమై ప్రత్యక్షమగును.
6. భావ పవిత్రత 'ధర్మము' అనుకుంటే ధర్మము అంతఃపవిత్రతకు సూచకమగును.
7. శౌచము – ఆరోగ్య సంరక్షణాదులు ధర్మము అనుకుంటే ధర్మము శరీరనిష్ఠకు నిదర్శనం.
8. ఈశ్వరోపాసన, ఆత్మోన్నతి ధర్మం అనుకుంటే ధర్మము ఆధ్యాత్మికతను సూచించును.
9. స్వాధ్యాయము, యజ్ఞానుష్ఠానం ధర్మము అనుకుంటే అది సాధనారూపము దాల్చును.

10. దుష్టనాశనము, దేశరక్షణము, యుద్ధము ధర్మము అనుకుంటే ధర్మము రౌద్రరూపము దాల్చును."

"ఎవరు ధర్మాలపట్ల అసూయ వహిస్తారో, ఎవరు వాటిని నమ్మి సేవిస్తారో ఆ ఇరుతెగల వారిని గూర్చి, వారికి కలిగి స్థితి గతులను గురించి తెల్పుము" (అను. 5-423) రజస్తమో గుణవికారం పొందిన మనసులు గల మనుష్యులు ధర్మం మీద పగ బూనుతారు. అటువంటి వారు నరక లోక నివాసమే గతి. సత్యవ్రత పారాయణులు నిరంతరం ధర్మమునే సేవిస్తారు. వారు స్వర్గలోక వాసానికి అర్హులు.

8. పూజనీయులు

"దేవతలు కూడా మొక్కదగిన నరులు ఉంటారని వింటాను. అట్లాంటి వారి గురించి తెలియజేయండి" (3-327) **"ఈ లోకంలో అందరికీ పూజనీయులు ఎవరు?"** (ఆను. 2-130) ధర్మ, అర్థ, కామ, పురుషార్థాలలో ధర్మం తప్పని నడవడితో ఆచరించే వారు. సత్యనిష్ఠ గలవారు, వెలుపలి లోపలి పరిశుద్ధతను సాధించేవారు. దేనికి అంట కుండా ఉండేవారు. అహంకార మమకారాలు లేనివారు. వ్యామోహం లేనివారు. సత్ప్రవర్తన గలవారు. జ్ఞానులు.

9. తీర్థం

"మిక్కిలి ఎక్కువ పవిత్రతను కలిగించ గల తీర్థం ఏదో దయతో స్పష్టంగా తెలుపుము..." (4-240) తీర్థాలన్నీ మేలైనవే. మానవతీర్థం ఒకటుంది. దానిపేరు సత్యం. అది మిక్కిలి పవిత్రతను కలిగిస్తుంది. తమస్సు, రజస్సు అనే రెండు గుణాలను దూరంగా తొలగించుకొంటూ, సత్యాన్ని ఊతకర్రగా తీసికొని దానిలోనికి ప్రవేశించి స్నానం చేసినవాడు పరిశుద్ధతతో ప్రకాశిస్తాడు. గొప్ప వ్యక్తులు తీర్థాలతో సమానం, వారిని దర్శించటం వల్లకూడా తీర్థాల వలన కలిగే సిద్ధి కలుగుతుంది.

ఇంద్రియ నియమాలను అదుపు చేసికొనటం, దేహాన్ని మనస్సునూ నియమ నిష్ఠలద్వారా ఎండగట్టటం, ఇతర ప్రాణాలను హింసించకుండటం, మనస్సులో ఉద్వేగం రాకుండా చూచుకొనటం అనేవి కూడా తీర్థాలే. వాటిచేత ఎక్కువ శుద్ధత కలుగుతుంది. ఊరికే నీటిలో మునిగే పరిశుద్ధత కలుగుతుందా?

"దొరకొనని వాని గోరక / దొరకనొనందును మమమత్వతుష్టహృదయతం
బొరయక విగతస్పృహలగు / పురుషులు శుచులేల తీర్థములు వారలకున్?"

(అను. 4.244)

దొరకని వాటిని కోరక, దొరికిన వాటియందు మమకారము, తుష్టి అనే లక్షణాలను పొందక, ఆశను విడనాడి బ్రదికే నరులు పవిత్రులు, వారికి వేరైన తీర్థాలెందుకు?

"పుణ్యతీర్థాల విశేషాలు చెప్పు" (అను. 2. 71) దీనికి సమాధానంగా ఎక్కడెక్కడ నదులలో స్నానం చేస్తే పుణ్యమో తెలిపి చివరకు "కామాదులులేని మనసుతో తీర్థాలను సేవించాలి. దానివలననే కోరిన ఫలం సిద్ధిస్తుంది". దమము, శమము, అహింస, తపము, అనేవి తీర్థాలు. వాటి వలన అతిశయమైన శుచిత్వం లభిస్తుంది అని తెలిపిన ముగింపు ఆలోచనాత్మకమైనది.

'ఇంకో ప్రశ్నలో గంగానది పవిత్రమైనదని, గంగను తాకిన ఎంతటి పాపాలైనా పోతాయని తెలియజేస్తాడు. ఆ గంగలో ఎముకలు ఉన్నంత కాలం వారికి స్వర్గసుఖాలు ఉంటాయంటాడు. (2-100)

10. ఆధ్యాత్మిక అంశాలు

ఆధ్యాత్మిక సంబంధమైన ప్రశ్నలు ఇందులో చాలావరకు కనిపిస్తాయి. **"దారిద్ర్య, దుఃఖం పోగొట్టే జపం ఏది? లోకాల కన్నిటికీ మహనీయమై ఆశ్రయించి అనుభవించగల దైవం ఎవరు? అర్చనతో స్తుతితో ఎవరిని కొలిస్తే జనులు శుభాన్ని పొందుతారు? జపాలన్నిటిలో ఉత్తమ జపం ఏది? సంసార బంధాలను పోగొట్టేది ఏది?** "వంటివి. వీటన్నిటికి "ఓం నమో భగవతే వాసుదేవాయ" అంటూ విష్ణుజపం చాలంటాడు. "తపస్సు పద్ధతి గురించి తెలియజేయండి" (3-204) అని అడిగితే వస్తులుండడం తపస్సు కాదు. ఆత్మను హింసించడం, సత్యం, బ్రహ్మచర్యం, ఎడతెగని పరిశుద్ధత, మౌనం, సాటిలేని నిష్ఠ భూతదయ, మచ్చలేని త్యాగం అనేవి తపస్సంపదకు ఆకారాలు అంటాడు.

11. శివ తత్వం

ఈ పర్వంలో అన్నిటికంటే 'ఉమామహేశ్వర సంవాదం' అతి సమాచార భరితమైంది. అతి పెద్దది కూడాను. ఈ సంవాదం వేరే సంవాదాల కంటే భిన్నంగా వాక్యవాక్యంగా ప్రశ్నజవాబుల పరంపరతో సాగుతూనే ఉంటుంది. ఈ సంవాద ప్రారంభంలో ప్రశ్నలు కొన్ని పూర్తిగా శివునికి సంబంధించినవి. దైవాలుగా చెప్పుకుంటున్న వారిలో శివుడిది ప్రత్యేక స్థానం. శివుడి పుట్టుక, ఆకారం, ఆభరణాలు, వర్ణం, తలపై

భార్య, వాహనం, నివాసం వంటివన్నీ కూడా సామాన్యులకు సంశయాత్మకంగానే ఉంటాయి.

'జగదీశా! నీకు కంఠంలో నలుపెందుకు కలిగింది?'

"నీవు పినాకాన్ని అన్ని ఆయుధాలకంటె ఎక్కువ ఇష్టంతో ఎందుకు పట్టుకుంటావు?', 'ఎద్దును ఎక్కడానికి కారణం వినాలని ఉంది సర్వేశ్వరా!', "శ్మశానంలో నునికికిc గతంబేమి?..", 'నీవు చంద్రుడిని ప్రేమతో తలపై ధరించడానికి కారణం ఏమిటి?' ఇవన్ని చాల చిన్న విషయాలు. అయినప్పటికి ప్రశ్నోత్తరాలలో పలుకించుట వెనక ఉన్న ఆంతర్యం గురించి ఆలోచించాల్సిందే.

12. మరిన్ని అంశాలు

గృహస్థ ధర్మాన్ని అవలంభించి మనుష్యుడు మృత్యుభయం పోగొట్టుకోవచ్చునా? అని అడిగితే సుదర్శనుడి కథ చెప్తాడు. ఈ కథలో అతిథి పూజ ప్రాధాన్యంగా కనిపిస్తుంది. దైవం, పౌరుషం వీటిలో ఏది అధికం? అంటే అవి రెండు ఒకదానికి ఒకటి అవసరం అంటాడు. గరుత్మంతుని చరిత్రను తెలియపరుస్తాడు. ఇది ఆదిపర్వం ద్వితీయాశ్వాంలో ఉన్నదే. భవమోక్షంబగు ధర్మాన్ని ఉపదేశించుము? అంటే తత్వాలు, ఆధ్యాత్మికాంశాలను వివరించాడు. గొప్ప తత్వాన్ని వివరించిన హరసనత్కుమార సంవాదం చాలా పెద్దది. ధ్యానం, ఇంద్రియ నిగ్రహం, అహింస, గురు సమర్చన విధి, నిత్యానుష్ఠానం, తపస్సు వీటిలో ఏది పెద్దది? అనగా ఈ ఆరును మంచి మార్గాలే ఐనప్పటికి అహింస మిక్కిలి ఉత్తమం అంటాడు. "తమ జీవితాలకు ఆధారమైన యజమాని యెడల అతడి దగ్గర బ్రతికే వారు ఎలా ఉండాలి" అంటే చిలుక కథతో ఆశ్రితులను రక్షించే ప్రయత్నం చేయాలని బోధిస్తాడు.

ముక్తిని కలిగించే విష్ణుభక్తి బోధించు అంటే..కామక్రోధాలను అణచి మనస్సును సత్వగుణ భరితం చేసుకో అదే ముక్తి మార్గం, వైష్ణవ భక్తి అంటాడు. మునుల వలన శూద్ర స్త్రీలకు కలిగిన సంతానం బ్రహ్మర్షులు ఎట్లా అవుతారు" అంటే బీజ ప్రధానమే అంటాడు. "ధర్మార్థ కామాలను ఆచరించే వేళలు ఏవి" అంటే అర్థం తెలవారుజామున, ధర్మం పగలు, కామం రాత్రి అని తెలియజేసాడు. కొడుకుల రకాలను తెలుపండి అన్నపుడు...ఔరసుడు, దత్తిముడు, కృత్రిముడు, గూడజుడు, అపవిద్ధుడు, కానీనుడు, సహోఢుడు అంటూ మొత్తం 12 రకాలను కుమారులున్నారని తెలియజేస్తాడు.

13. భీష్మ నిర్యాణం

ప్రశ్నలన్నిటికీ సమాధానాలు అందించి తర్వాత చివరికి వేదమహర్షి కంటికి వెలుగువంటివాడు వాసుదేవుడు నీకు ఆరాధ్యదైవం. ఇక చింత వదిలి ప్రజలను పక్కగ పాలింపు అని చెప్పి ముగించాడు. వేదవ్యాసుడు కల్పించుకుని 'నీ ఉపదేశ సుధారసం తనివార గ్రోలి జ్ఞాన ఘనుడైనాడు.' వారికి సెలవిచ్చి పంపుము అంటాడు. ఇంటికి వెళ్ళి యాభై రోజులకు సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించగానే అందరితో, అన్ని వస్తువులతో వచ్చాడు.

"బలము నీవ నాకు భక్తుండ నీయెడ / నాలుబిడ్డ లేని యట్టివాడ
గావు నన్ను నధిక కారుణ్యమున నిమ్ము / సుజ్ఞ గమలదళమనోజ్ఞనయన" (ఆను.4-463)

కృష్ణుడు గంగా నందనా వెళ్ళుటకు అనుమతిస్తున్నాను. నీ తోటివారైన వసువులలో కలిసిపొమ్ము. భీష్ముడు ప్రాణా పానాది వాయువులను అడ్డగించి.... ఇంద్రియనిగ్రహం కలవాడు కావడంతో అవయవ ద్వారాల నుండి అడ్డగించబడిన ఆత్మ శిరస్సు భేదించుకుని అగ్నికణం వలె వెళ్ళిపోయింది. కర్మకాండ జరిపారు. గంగాదేవి దుఃఖించింది. కృష్ణుడు ఓదార్చాడు.

ముగింపు : ఈ పర్వాన్ని వృత్తాంతాల వారిగా చూసినపుడు గౌతమీ లుబ్ధక సర్ప మృత్యుకాల సంవాదం, సుదర్శన కథ, మతంగుని కథ, విశ్వామిత్రుని జన్మ రహస్యం, వీతహవ్యుని కథ, గరుడోపాఖ్యానం, భంగాస్వన వృత్తాంతం, అష్టావక్ర చరిత్ర, దేవశర్మ - రుచి కథ, చ్యవనుని కథ, నృగ చరిత్ర, కపిలగోవుల కథ, సురభి కథ, పేనపాఖ్యానం, శంతన బాహువు కథ, కుమారస్వామి జనన కథ, సప్తర్షి వృషాదర్భి సంవాదం, సూర్య జమద సంవాదం, ఇంద్ర-మతంగ సంవాదం, వ్యాస-కీట కథ, ఉమామహేశ్వర సంవాదం, విష్ణు-శివ సహస్రనామాలు, ఉచథ్యుని కథ, దుర్వాసుని కథ అనేవి ప్రధానంగా కనిపిస్తాయి. ఇవన్నీ కూడా అప్పటికప్పుడు సృష్టించి చెప్పిన కథలు కావు. వేద, పురాణ, ఉపనిషత్తుల వంటి మహా గ్రంథాల ఆధారంగా తెలియజేసినట్లుగానే కనిపిస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. అప్పలస్వామి, పురిపండా. **'వ్యావహారికాంధ్ర మహాభారతం'** (శాంతి పర్వము). 1976. రాజమండ్రి: ప్రాచీన గ్రంథావళి.
2. నిర్వికల్పానంద, **'శ్రీమద్భగవద్గీత'** (పదచ్ఛేద టీకాతాత్పర్య సహితం). 2010. హైదరాబాద్ : రామకృష్ణమఠం.

3. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. శ్రీనివాసులు, సూరం. సంపా. **'శ్రీమహాభారతము'** (అన్ని పర్వాలు, 7 సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.

4. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. **'భీష్ముడు చెప్పిన రాజనీతి కథలు'** 1986. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.

5. విశ్వేశ్వర శాస్త్రి, జన్నాభట్ల. సంపా. **'మహాభారత వైజయంతి'** (తొమ్మిది సంపుటాలు). 2006. గుంటూరు : భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

6. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. **'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము'** (అన్ని పర్వాలు, 15 సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.

7. హనుమంతరాయ శర్మ, బలభద్రపాత్రుని. **'మహాభారత విమర్శనము'** (రెండు సంపుటాలు). 1996. గుంటూరు: భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

